POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
ఆగస్టు 2024
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 42 సంచిక: 04



## శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా ఆరాధన

(17-08-2024)

## ఈ నెల పండుగలు

ఆగస్టు 02 - స్వామి వివేకానంద ఆరాధన [తిథి - ఆషాఢ బహుళ త్రయోదశి]

ఆగస్టు 16 - శ్రీ రామకృష్ణ పరమహంస ఆరాధన

ఆగస్టు 17 - శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా ఆరాధన

ఆగస్టు 24 - అవధూత శ్రీ వెంకయ్య స్వామివారి ఆరాధన

ఆగస్టు 26 - శ్రీ కృష్ణ జన్మాష్టమి

ఆగస్టు 27 - శ్రీ ఆనందమయి అమ్మ ఆరాధన

"సరిగా ప్రార్థన చేయగల్గాలంటే సద్గురువుపట్ల అచంచలమైన భక్తి శ్రద్ధలుండాలి. వారిని కోరదగినదేదో వివేకంతో తెలుసుకోవాలి. తెలుసుకుంటే ఆయనను కోరవలసింది ఏమీ అగుపించదు. వారి అనుగ్రహం వుంటే అన్నీ లభిస్తాయి అని అర్థమవుతుంది. అట్టి ఆయనను నిరంతరము గుర్తుపెట్టుకోవడమే నిజమైన ప్రార్థన. అట్టి ప్రార్థన మన నడవడిని, మన భావాలను సంస్కరిస్తుంది. అందరూ ఆయన రూపాలే అయితే ఎవరిని ద్వేషించగలము? ఎవరిపై పంతమూ, అసూయా వహించగలము? అసూయ మొదలైన భావాలు వ్యర్థములేగాక, ఎంత అనర్థదాయకాలో నిజంగా తెలిస్తే మన నడవడి ఇలా ఎందుకుంటుంది? సరిగా ప్రార్థన చేయగల్గడమంటే మన పాత వ్యక్తిత్వం నుండి మరణించి, క్రొత్త వ్యక్తిత్వంలోనికి మరల జన్మించడమే!!"

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# భూమికి నమస్కరించడమెందుకు?

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

నిత్యము ప్రాతఃస్మరణలో భూమిని కీర్తించి క్షమాపణ పూర్వకంగా నమస్కరించడంలో ఒక రహస్యం ఉన్నది. మనకెవరి మీద అపారమైన ప్రేమ, గౌరవాలూ ఉంటాయో వారికి సంబంధించిన అందరి మీద ప్రేమ, గౌరవాలు ఉంటాయి. ఇది మన నైజం. భూమి పట్ల మనం ప్రేమ పూర్వకమైన గౌరవాన్ని, శ్రద్ధనూ వహిస్తే, ఆమెను తల్లిలా ప్రేమిస్తే, ఆ భూమి యొక్క సంతతి అయిన అన్ని జీవుల పట్ల మనలో ప్రతి ఒక్కరికీ ప్రేమ గౌరవాలేర్పడతాయి. ఈ భావాలే ధర్మాచరణకు, భక్తికి మూలం. అది భగవద్గీతలో చెప్పబడ్డ దైవీసంపదకు, సత్వగుణానికి ముఖ్యచిహ్నం. అలాటి సత్వగుణము, దైవీసంపద లేకుండా యజ్ఞ, దాన, తప, కర్మలనాచరించినా ఫలితం ఉత్తమంగా ఉండదని భగవద్గీత.

భూమి అన్ని విధాల మనకు తల్లి అయినట్లే సర్వజీవులకు తల్లియే. అంటే అన్ని జీవులు సహోదరులు- ఒక తల్లి గర్భాన్ని, పాలను పంచుకొని పుట్టి పెరిగే వారమే. భూమి మీద పుట్టి అన్ని ప్రాణులు జీవిస్తాయి. వీటిలో సముద్రాది జలరాశులలో జీవించేవి వున్నాయి. భూమి మీద జీవించేవి వున్నాయి. ఇవన్నీ భూమి నుండి ఆహారాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పొందవలసిందే. ఈ సత్యాన్ని గుర్తిస్తే వసుదైక కుటుంబంగా మానవాళే గాక సర్వ జీవరాశీ మనగలుగుతుంది.

ఆధునిక విజ్ఞానశాస్త్రం ప్రకారం భూమి జడం గదా. అటువంటి భూమిని తల్లిగా భావించటం చక్కని కవి సంయమనము, అలంకారము, భావన అయితే కావచ్చు కానీ అది అజ్ఞాన జనితమైన బాల్య చాపల్యమే కదా, భ్రాంతే కదా అని ఆధునికులు తలచవచ్చు. 'ఏది నిజం', 'విజ్ఞాన వీచికలు' అనే గ్రంథాలలో ఈ ఆధునిక భావమే అసత్యమని చక్కని నిరూపణ ఉన్నది. అలాగాకపోయినా మానవ జీవితం భావ ప్రధానమైనది. ఆ భావసంపద లోపిస్తే జీవితము నిస్సారము, అనాశక్తికరము, దుర్భరము అవుతుంది. ఒక విలువైన వస్తువును మనం పొందినపుడు దానిని ఎంతో శ్రద్ధతో చూసుకుంటాము. అది ఒకరిచ్చిన ప్రేమకానుక అయినప్పుడు మన దృష్టిలో ఆ వస్తువుకు భౌతికమైన ఆధారమే లేని మరింత ప్రాధాన్యం మన భావంలో కలుగుతుంది. అది ప్రేయసి యిచ్చిన రుమాలు కావచ్చు. దాని విలువ ఒక రూపాయియే కావచ్చు. కానీ అది యే ప్రేమకు ప్రకటరూపమో అది మన జీవితం కంటే విలువైనది. ప్రేమ కోసం రాజ్యాలను, ఆస్తిపాస్తులను, చివరకి జీవితాన్ని కూడా త్యజించే మానవత యొక్క విలువంతా ఆ ప్రియ భావములోనే ఉన్నది. ఇలాటి భావసంపద, వికాసము మానవ మనస్తత్వ శాస్త్ర దృష్ట్యా మన వ్యక్తిత్వం యొక్క వికాసానికెంతో అవసరము. మనిషి బ్రతికేందుకు తిండి, గుడ్డలే ముఖ్యమని మనమెంత తలచినా, బాల్యంనుండే తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయతలను నోచుకోని వారి వ్యక్తిత్వవికాసం దెబ్బతిని, అట్టి వ్యక్తులు సంఘంలో చీడ పురుగులుగా రూపొందడం మనస్తత్వ శాస్త్రమెరిగిన సత్యమే. ఈ ప్రేమన్నది భౌతికమైన సత్యం కాదని, వస్త్ర, ఆహారాలు తీర్చినట్లుగా శారీరక అవసరాలు తీర్చలేని భావం మాత్రమేనని ఎంత వాదించినా మనిషియొక్క ఆంతరంగికమైన ఆరోగ్యము, వికాసము దానిపై ఆధారపడి, అవి పొందడం వలన తాను సుఖంగా జీవించగల్గి, సాటివారి శ్రేయస్సు కోసం ప్రేమతో ప్రాకులాడే బాధ్యతగల వ్యక్తిగా రూపొందుతాడో, అదిలేక తన జీవితాన్ని మానసిక వికారాలకు బలి చేసుకోవడమేగాక సంఘ శ్రేయస్సును విచ్ఛిన్నం చేసేవాడుగా రూపొందుతాడోనన్న దానిని నిర్ణయించే జీవితసత్యం అది.

సాపేక్షిక సిద్ధాంతం ప్రకారం వస్తువులు, పదార్థము, ఆకాశము, కాలము వేరుగావని ఎంత బుద్ధితో మనం తెలుసుకున్నా, మన నిత్యజీవితంలో అవి సత్యమనిపించే స్థాయిలోనే కొనసాగవలసివచ్చినట్లు, ప్రేమ సత్యమన్న దృష్టి మీదనే మానవ మనుగడ ఆధారపడుతుంది. వాస్తవిక జీవితావసరం దృష్ట్యా భూమిని ప్రేమతో నిండిన తల్లిగా భావించడమే సరైన పద్ధతి. 'ఏది నిజం', 'విజ్ఞాన వీచికలు' గ్రంథాలలో చెప్పబడిన రీతిన అన్ని వస్తువులలాగే అదికూడా విశ్వచైతన్యశక్తి యొక్క రూపమే కదా! ●

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:42 ఆగస్టు - 2024 సంచిక:04

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"

## విషయ సూచిక



| | | | |
|---|---|---|---|
| 01. | భూమికి నమస్కరించడమెందుకు? | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | అవధూత శ్రీ వెంకయ్యస్వామి | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి లక్ష్మీప్రభ | 08 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 10 |
| 06. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 15 |
| 07. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 18 |
| 08. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 22 |
| 09. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి కె. రమ | 26 |
| 10. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ రామచంద్ర రావు | 27 |



చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# పరిప్రశ్న

## పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

**ప్రశ్న :- ధ్యానానికి రూపమూ, నామమూ అవసరమా? ప్రార్థనకు పటము, విగ్రహము అవసరమా?ఇది ఎంతవరకు నిజం ?**

**- అన్వేషి, చింతపల్లి**

**జవాబు** :-ఏదైనాసరే అవసరమా? అని ప్రశ్నిస్తే 'ఎవరికో చెప్పు, అప్పుడు చెబుతాను' అన్నదే నా సమాధానం. ఒకరికి అవసరమైనది ఇంకొకరికి అవసరము కాకపోవచ్చు. మనసులో రేఖాగణితం చేసుకోగల వాడికి కాగితంమీద బొమ్మగాని, లేక గణితసూత్రం గీచి గుణించుకోనవసరముండదు. అలాటి వారికి అవి గీచుకొనడం అనవసరమైన బాదరబందీ అన్పిస్తుంది! అలా గీసుకుంటేనే గణితం సులభమన్పించేవారికి మనస్సులో గుణించుకొనడం వృథా ప్రయాస అన్పిస్తుంది. ఇద్దరూ సాధకులైతే, పరస్పరం తర్క వితర్కాలు లేకుండా ఎవరికి సులభమన్పించిన సాధన వారు చేసుకుంటారు. దానిగురించి చర్చించి యితరుల వాదం తప్పని ఋజువు చేయజూచేవారికి, సాధన చేయడంకంటే తమకెక్కువ తెలుసునని యితరులనుకొనడం, వాదంలో గెలవడము యిష్టమన్నమాట. సాధకుడు కాకపోయాక యీ ప్రశ్న అప్రస్తుతమవుతుంది. ఏది రైటైతేనేమి - తాను దాని ననుసరించక, దానిని గురించి యితరులతో చర్చించడం మాత్రమే లక్ష్యమయ్యాక?

అయినా యీ రెంటిలో ఏది ఎక్కువ స్థితి, ఏది తక్కువ? అంటే, ఆ రెండూ గొప్పస్థితులేగాని, వాటి గురించి ఇది ఎక్కువది, అది తక్కువది అని వాదించేవారిది మాత్రము అన్నిటికంటే హీనమైన స్థితి. ●

---

**ప్రశ్న :- నిత్యకృత్య విధి నిర్వహణలో బాబా సూక్తులను అమలుపరచ యత్నిస్తూ, మానవత్వంతో ప్రతివారిలోను బాబా వున్నాడని, ధర్మబద్ధంగా వుండయత్నిస్తే వ్యాపారంలో నష్టపడటం జరుగుతుంది. వీటికి సమన్వయం ఎలా ?**

**- డి. కృష్ణమూర్తి, ఒంగోలు**

**జవాబు** :-రోగులకు మందు పథ్యము ఎలా యివ్వాలో అలానే మానవతా విలువలు నెరుగని వారితో మనం వ్యవహరించేటప్పుడు వారిని సాధ్యమైనంతవరకు క్రమశిక్షణతో మనతో వ్యవహరించేలా, చేయడానికి అవసరమైన యుక్తిని ఉపయోగించాలి. అయితే అది మనలో స్వార్థాన్ని కప్పిపుచ్చుకొనే యత్నంగా మారకుండా సత్సంగము, స్వాధ్యాయ మననాలతో జాగ్రత్త తీసుకోవాలి. అందరిలో బాబాను చూసుకోడానికి, ఈ రీతిన వ్యవహరించడానికి అప్పుడు వైరుధ్యముండదు. ఈ విషయాన్ని 'మతం ఎందుకు', 'శ్రీసాయి ప్రబోధామృతము' అనే గ్రంథాలలో కూలంకషంగా చర్చించాను. వాటిలోని జీవితతత్వం గూర్చిన అవగాహనను పొందనిదే ఈ రీతిన వ్యవహరించటం సాధ్యంకాదు. అట్టి వ్యవహారమే ధర్మం. అందరిలోను బాబా వున్నారన్న భావం యిద్దరి మధ్య స్నేహం లాంటిదైతే, వారు చదరంగం ఆడడం లాంటిది వ్యవహారం. వ్యవహారం లౌకికంగా యితరులు స్వార్థబుద్ధితో మనతో అధర్మంగా వ్యవహరించి, మనకు నష్టం కలిగించకుండా చూచుకోవడము మాత్రమే మన లక్ష్యమైనంతసేపు మనలోని ఆధ్యాత్మభావం దెబ్బతినదు. భగవద్గీత సారాంశమంతా యిదే.

(ఆగస్టు 2018 సాయిబాబా మాసపత్రిక నుండి)

# అవధూత శ్రీ వెంకయ్యస్వామి

**పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ**

"అది ఒక మారుమూల పల్లెటూరు, ఊరు చివరలో పాతకాలంనాటి ఆంజనేయస్వామి ఆలయం. ప్రక్కనే నేలపై వెలుగుతున్న అగ్నిహోత్రమున్నది. దాని ప్రక్కనే చిన్న ఈతాకు చాప మీద స్వామి కూర్చుని వున్నారు. చూడటానికి 70 లేక 80 సం॥ల వయస్సుగల వృద్ధులుగా వున్నారు. గుండుతల, ఎక్కడో లోతుగా చూస్తూ చిత్రంగా వెలిగే కళ్ళు, కదలాడే బోసినోరు, వుండి వుండి మూలుగుతున్నట్లు అస్పష్టంగా ఆ నోటినుండి వెలువడే మాటలు! అప్పుడప్పుడు ఆయన తన గుండునూ, మూతినీ చేత్తో వ్రాసుకుంటున్నారు. ఎండనక, వాననక వెలిగే ధునిసెగకు కాబోలు కాగి కాగి, రాగి కాగులా తయారయింది ఆయన శరీరఛాయ. వారి మొలకొక గోచీ మాత్రమున్నది. కొంచెం దూరాన ఒక కుటీరంలో ఒకరిద్దరు సేవకులు పనిచేసుకుంటున్నారు. ఆయన ప్రక్కనే నేల బారుగా చిన్న చక్రాలు గల చెక్కతో చేసిన తోపుడుబండి వున్నది. వారు నీరు త్రాగడానికి కాబోలు, ప్రక్కనే తాటియాకులతో చేసిన దొన్నెలాంటిది ఒకటి వున్నది. ఆయనతోబాటు ఎప్పుడూ నలుగురు వ్యక్తులు తోడుగా వుంటారని, వారు రాత్రంతా ఆయనతోపాటే మేల్కొనవలసిందేననీ, ఆయన తనను ఎప్పుడు ఎక్కడికి తీసుకువెళ్ళమంటే అక్కడకు వాళ్ళాయనను తీసుకు వెళ్తారనీ చి॥ రామకృష్ణారెడ్డి చెప్పాడు. వారెక్కడున్నా, ప్రక్కనే అతి దగ్గరలో అగ్ని అలానే వెలుగుతూందట. ఒక పాత చాప, ఒక పాత గుడ్డలమూట, రెండు పాత దిండ్లు, ఒకటి రెండు అల్యూమినియం పాత్రలు తప్ప వారివద్దయింకేమి లేవు. స్వామి అమిత నిరాడంబరులు. నేను మొదటిసారి స్వామిని దర్శించినప్పుడు చూచిన దృశ్యమిది".

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు తాము రచించిన శ్రీ వెంకయ్యస్వామి చరిత్రలో స్వయంగా వ్రాసిన మాటలివి. పైన ఆయన వర్ణించిన స్థితిలో వున్న ఆ వృద్ధుడు గొప్ప ఆధ్యాత్మిక స్థితి పొందిన అవధూత అని పూజ్యశ్రీ మాస్టరుగారు గుర్తించారు. అట్టి అవధూత దర్శనం మానవాళికి శ్రేయస్సు చేకూర్చగలదని విశ్వసించిన పూజ్యశ్రీ మాస్టరుగారు తమ వద్దకు వచ్చిన వారిని స్వామి దర్శనానికై పంపేవారు. అలా ఎందరో స్వామిని దర్శించుకొని వారి ఆశీస్సులను పొందారు.

పూజ్యశ్రీ మాస్టరుగారికి శ్రీ స్వామివారి ప్రథమ దర్శనం కూడా ఒక అద్భుత లీల!

అవి పూజ్యశ్రీ మాస్టరుగారు నెల్లూరు జిల్లా విద్యానగర్ కాలేజీలో పని చేస్తున్న రోజులు. సం॥1975లో శివరాత్రి నాడు ఆయన శ్రీ వెంకయ్య స్వామి దర్శనానికి గొలగమూడి వెళ్ళాలనుకున్నారు. శ్రీ వెంకయ్యస్వామి గురించి ఆయన విన్నారు. కానీ స్వామి దర్శనానికి అంతవరకూ వెళ్ళలేదు. ఆ రోజున స్వామి గొలగమూడిలో వుంటారో లేదోననే విషయం తెలుసుకున్నాక వెళ్ళడం మంచిదని ఒకరు సందేహం వెలిబుచ్చారు. కానీ ఆయనకు వెళ్ళాలని బలంగా అనిపించింది గనుక వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. ఉదయం గం॥8:30ని॥లకు స్వామి దర్శన ఆశీస్సులు ప్రసాదించమని సమర్థ సద్గురువైన శ్రీసాయినాథుని ప్రార్థించి బయలుదేరారు. నెల్లూరు చేరి గొలగమూడి బస్సు ఎక్కగానే అక్కడ స్వామి తంబుర పట్టుకున్న స్వామి శిష్యుడు కనిపించాడు. అతడు యిలా చెప్పాడు: "స్వామి నాలుగు రోజుల క్రిందట నెల్లూరులోని దత్తాత్రేయ మఠంలో విడిది చేశారు. అంతేగాక అక్కడే పదిరోజులపాటు వుంటామని కూడా చెప్పారు. అందుకని ఆయన నిర్వహించే ధునికి అవసరమైన కట్టెలుగూడ శిష్యులు అక్కడే సమకూర్చారు. కానీ స్వామి ఈ రోజు సరిగ్గా ఉదయం గం॥8:30ని॥లకు వున్నట్టుండి గొలగమూడి బయలుదేరారు. వారి సేవకులందరు తలోకవైపుకు వెళ్లడంవలన స్వామిని గుఱ్ఱపుబండిలో పంపవలసి వచ్చింది. ఈపాటికి స్వామి గొలగమూడి చేరి వుంటారు"

స్వామి అక్కడికి వస్తారని ఎవ్వరికీ తెలియకపోవడంతో స్వామి దర్శనార్థమై ఎవ్వరూ రాలేదు. కనుక సాయంత్రం వరకు పూజ్యశ్రీ మాస్టరుగారికి ఏకాంతంగా స్వామి సన్నిధిలో గడిపే అవకాశం లభించింది. ఆయన కోరుకున్నట్లు స్వామి దర్శన అనుగ్రహ ఆశీస్సులు పుష్కలంగా లభించాయి.

ఆ రోజుల్లో గొలగమూడి, నెల్లూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామి దర్శనానికై వస్తుండేవారు. ఐతే ఎక్కువమంది లౌకిక కోరికలు తీర్చుకోవడం కోసమే వస్తుండేవారు. అలాగాక ఆయన పరమార్థాన్ని కూడా ప్రసాదించగల మహాత్ములని, ఆయన దర్శన ఆశీస్సుల వలన మన ఆధ్యాత్మిక సాధనలో ఉన్నతి లభిస్తుందని పూజ్యశ్రీ మాస్టర్‌గారు బోధించేవారు. ఆయన చెప్పినట్లే నేడు వేలాదిమంది ప్రజలు ఐహిక, ఆధ్యాత్మికతల కోసం స్వామిని సేవించి ఉత్తమ శ్రేయస్సు పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో నెల్లూరు జిల్లా సమీపంలో గొలగమూడి గ్రామంలో నివసించిన అవధూత శ్రీ వెంకయ్య స్వామి 24-08-1984 తేదీన అక్కడే సమాధి చెందారు. ఆయన సశరీరులుగా వున్నప్పుడేగాక నేటికీ కూడా భక్తులు పిలిస్తే పలుకుతున్నారు.

అవధూత శ్రీ వెంకయ్యస్వామి చేసిన లీలలు అత్యద్భుతాలు.

కూచి పట్టాభిరామయ్య (40సం॥లు) అనునతడు తన అనుభవాన్ని ఇలా చెప్పాడు: "పుట్టినప్పటి నుండి 5 సం॥లు వచ్చేవరకు చలి జ్వరము, విరేచనాలతో బాధపడుతుండేవాణ్ణి. తల్లిదండ్రులు నన్ను ఎంతో మంది డాక్టర్లకు చూపించారు. లాభం లేకపోవటంతో యంత్రాలు వేయించారు. మంత్రాలు పెట్టేవాళ్ళ దగ్గరకు తీసుకెళ్ళేవారు. కానీ ప్రయోజనమేమీ కనిపించలేదు. చివరకు నన్ను వెంకయ్యస్వామి దగ్గరకు తీసుకెళ్ళారు. అప్పుడు స్వామి నన్ను చూస్తూనే, "అబ్బో! ఈయనకేమయ్యా!! బాగుంటాడులే, మిద్దెమీద మిద్దె కడతాడు" అని, పచ్చి వేరుశనగపప్పు తినిపించి గుడ్డతో మంత్రించి పంపించారట. ఆ రోజు నుండి నాకు వ్యాధి తగ్గిపోయింది. అంతేగాక ఈ రోజు వరకు నాకు కనీసం జలుబు కూడా రాలేదు. స్వామి మహిమ అంతటిది!"

స్వామి సర్వజ్ఞుడు. మైకాగనిలో సర్వేయరుగా పనిచేసే పోలిరెడ్డిగారికి ఒకరోజు స్వామి, "నీవు పాతాళానికి అధిపతివి అవుతావు" అని చీటీ వ్రాయించి యిచ్చారు. కొద్దిరోజులలో భూగర్భగనికి అతడు మేనేజర్ అయ్యాడు.

అలాగే జులై 13, 1979న అమెరికా వారు ఆకాశానికి పంపిన అంతరిక్షనౌక, 'స్కైలాబ్' ఆకాశాన్నుండి క్రింద పడుతుందని, అది మన దేశంలో ఎక్కడైనా పడవచ్చని శాస్త్రజ్ఞులు ప్రకటించారు. ఆ విషయమై భయపడుతున్న భక్తులతో స్వామి, "అదెక్కడో సముద్రంలో పడుతుందిలేయ్యా" అన్నారు. అలానే జరిగింది.

శ్రీ స్వామి సమాధి అనంతరం కూడా అనేక లీలలు ప్రదర్శిస్తున్నారు.

*మిగతా 29వ పేజీలో*

# మాతృదేవి స్మృతులు

శ్రీమతి లక్ష్మీప్రభ

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లితో తన అనుభవాలను, స్మృతులను విజయవాడ వాస్తవ్యురాలు శ్రీమతి లక్ష్మీప్రభగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

నేను హైదరాబాదులో 1991, 92 సంవత్సరాలలో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేదానిని. అప్పుడు జీతంలో కొంత దక్షిణగా పూజ్యశ్రీ అమ్మగారికి పంపించేదాన్ని. అప్పటికి నేను పూజ్యశ్రీ అమ్మగారిని చూడలేదు. ఒకసారి నేను పంపించే దక్షిణపట్ల నా మనసులో వేరే భావం వచ్చింది.. అంటే 'అది పూజ్యశ్రీ అమ్మగారికి చేరుతోందా, దానిని వారే ఖర్చు చేస్తున్నారా?' అనే భావం ఏదో వచ్చింది. వెంటనే నాకు పూజ్యశ్రీ అమ్మగారినుంచి ఉత్తరం వచ్చింది. అందులో, "మీరెవరో నాకు తెలియదు, నాకు దక్షిణ ఎందుకు పంపిస్తున్నారో తెలియచేయండి. మీరిచ్చిన దక్షిణ వాడుకోలేదు!" అని వ్రాశారు. నాకు చాలా భయము, ఆశ్చర్యము కలిగాయి. ఎందుకంటే నా మనస్సులో ఇలా అనుకోగానే, అక్కడనుంచి సమాధానం రావడమంటే, వారు ఎంతటివారై వుంటారు? వెంటనే నేను కూడా ఉత్తరం వ్రాసాను. "క్షమించండి అమ్మా! నేను ఫలానా, మీరు వాడుకోవడానికే దక్షిణ పంపిస్తున్నాను" అని.

తరువాత నాకు ప్రభుత్వకార్యాలయంలో ఉద్యోగం వచ్చింది. అప్పుడు ఒకరోజు ఒంగోలులో పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకున్నాము. మా అమ్మ, అక్క, నేను దర్శనానికి వెళ్ళాము. మా అమ్మ, "అమ్మగారూ, నాకు 11 మంది సంతానం. మావారు వుండగా ఏడుగురికి పెళ్లిళ్లు చేశాము. ఇంకా నలుగురు పెళ్ళికి వున్నారు. వీళ్ళకి మీరే పెళ్లిళ్లు చెయ్యాలి, వీళ్ళ బాధ్యత మీదే!" అంది. "అలాగే!" అన్నారు పూజ్యశ్రీ అమ్మగారు. మేము అదే మొదటిసారి పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకోవడం. మా అమ్మ చనువుగా బాధ్యత అప్పగించడం, వారు 'సరే' అనడం గురించి ఆలోచిస్తే చాలా ఆశ్చర్యంగా వుంటుంది. కానీ పూజ్యశ్రీ అమ్మగారు 'అలాగే' అన్నమాట, మాటవరసకి అనలేదు! ఈనాటికి మమ్మల్ని అలాగే కాపాడుతున్నారు. అదీ పూజ్యశ్రీ అమ్మగారి గొప్పతనం. మనం వారి నుంచి అభయం పొందాక మనం వెనకడుగేసినా వారు వేయరు.

పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల నాకు వివాహం అవ్వడం, పాప (హనీలా) పుట్టడం జరిగింది. హనీలా కొంచెం పెద్దయ్యాక మల్కాజిగిరిలో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి తీసుకెళ్ళేదాన్ని. ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారు కొంతమంది సత్సంగ సభ్యులందరితో బాసర యాత్ర చేశారు. అప్పుడు నేను, హనీలా కూడా వెళ్ళాము. అక్కడ రెండుపూటలా సత్సంగాలు జరిగేవి. ఒకరోజు పూజ్యశ్రీ అమ్మగారు ఒకొక్కళ్ళని లేపి, "పూజ్యశ్రీ మాస్టరుగారి పట్ల మీకు ఎటువంటి భావం వుంది?" అని అడిగారు. నా వంతు వచ్చింది. నేను లేచి నిల్చున్నాను కానీ చెప్పడానికి సందేహిస్తున్నాను. ఎందుకంటే నాకు ఆయన పట్ల స్నేహితుడు అన్న భావం వుండేది. ఆ భావంతోటే రెండుమూడు సార్లు నా సమస్యలు వారికి చెప్పుకుంటూ ఉత్తరాలు వ్రాసాను. నా భావాన్ని చెప్తే బాగుండదేమోనని సంశయిస్తుంటే పూజ్యశ్రీ అమ్మగారు, "నీకు మంచి స్నేహితులు అనిపిస్తారు కదూ!" అన్నారు. ఆనందం, ఆశ్చర్యంతో నా మనస్సు ఉబ్బితబ్బిబ్బయ్యింది.

'భగవాన్ శ్రీ భరద్వాజ' గ్రంథం వచ్చే ముందు



భక్తులందరిని పూజ్యశ్రీ మాస్టరుగారితో వారికి గల అనుభవాలు వ్రాసిమ్మన్నారు. మా ఇంటిదగ్గర పూజ్యశ్రీ మాస్టరుగారు వేదమ్మతో సహా నాకు దర్శనం ఇచ్చిన అనుభవం వ్రాసి పట్టుకెళ్తూ, 'ఇది ఇవ్వనా వద్దా? ఒకవేళ ఆ లీల నా భ్రమేమో!' అనుకున్నాను. నేను దర్శనానికి వెళ్లిన వెంటనే పూజ్యశ్రీ అమ్మగారు, "ఈరోజే శ్రీదేవి (పూజ్యశ్రీ అమ్మగారి సోదరి మరియు భగవాన్ శ్రీ భరద్వాజ గ్రంథకర్త) ని అడిగాను, లక్ష్మీప్రభ అనుభవం వ్రాసిచ్చిందా లేదా అని!" అన్నారు. వెంటనే ఆ అనుభవం వ్రాసిన కాగితం వారి చేతిలో పెట్టాను. అంటే ఏదైనా ఒక ఆలోచన రాగానే వెంటనే పూజ్యశ్రీ అమ్మగారినుంచి సమాధానం వచ్చేది! అలాంటివి చాలా సందర్భాలు, చాలా సంఘటనలు!!

పూజ్యశ్రీ అమ్మగారి 75వ జన్మదినం సందర్భంగా పూజ్యశ్రీ అమ్మగారి గురించి నేను ఒక చిన్న కవిత వ్రాసుకున్నాను. అది పూజ్యశ్రీ అమ్మగారికి పంపిద్దామనుకున్నాను. కానీ ఇంతలోనే వారు సమాధి స్థితులైనారు. ఆ కవితని మీతో పంచుకుంటున్నాను. గొప్పగా లేకపోయినా వారితో నా అనుబంధం అది!!

*అలివేలుమంగమ్మ తల్లి!*
*మాట మధురం, మనసు మధురాతి మధురం!*
*మీ రాక మా జీవితాలకు కొత్త నిర్వచనం! మాటలకందని అనుబంధం!*
*మనసులో తలచుకుంటేనే స్ఫూర్తినిచ్చే పదం! మాకు మా అమ్మ వున్నారనే కొండంత ధైర్యం!*

*మా కన్నతల్లిని మించిన ఆప్యాయతానురాగాలు,*
*మా నడవడికను తీర్చిదిద్దే సలహాలు,*
*మానిత్యజీవితానికి శోభాయమానాలు!*
*మేమెక్కడున్నా మా అమ్మ మావెంటే వున్నారనే మనోధైర్యం మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది!*

*మనందరి అమ్మ 'శ్రీ అలివేలుమంగమ్మ' మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, 'అమ్మ' అని తలచుకున్నప్పుడల్లా, ఆనందాశ్చర్యాలను కలిగిస్తూ, ఆటుపోట్లు ఎన్నొచ్చినా, అలవోకగా జీవితాన్ని నడిపించే శక్తిని అనుగ్రహించిన అలివేలుమంగమ్మ తల్లికి, కృతజ్ఞతాభివందనములు !!*

*ఓం సర్వజ్ఞాయై నమః!*

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 13వ ప్రసంగము

### ''శక్తానాం భూషణం క్షమా''

వ్యావహారికులు, జ్ఞానులు అయిన జనులకు వుండాల్సిన క్షమకు ఇది లక్షణము. ఇది సంసార జీవులకు సంబంధించినది. ఇక సన్యాసులు, సాధువులు పాటించవలసిన క్షమ యింతకు మించినది. ఎవరైనా అపకారం చేసినా దానిని పట్టించుకోకుండా ప్రత్యుపకారము చేయడం.

ఎలాగంటే—

ఒకసారి సమర్థ రామదాసుగారు శిష్యులతో చెరుకు తోట దగ్గర నుండి వెళుతున్నారు. శిష్యులు కొన్ని చెరుకు కర్రలను విరుచుకుని తిన్నారు. ఇంతలో యజమాని వచ్చాడు. అడగకుండా చెరుకు గడలను విరుచుకొని తినినందుకు కోపం వచ్చి వారందరికీ పెద్ద సమర్థ రామదాసుగారని తెలుసుకొని ఆయనను గట్టిగా కొట్టాడు. ఇది శివాజీ మహారాజుకు తెలిసింది. శివాజీ ఆ తోట యజమానికి కబురు పంపాడు. అతడు వచ్చేటప్పటికి రామదాసుగారు సింహాసనం పైన, శివాజీ క్రింద కూర్చుని వున్నారు. ఇది చూచి తోట యజమాని గడగడ వణకసాగాడు.

శివాజీ యిలా అన్నాడు: "స్వామీ! ఆజ్ఞాపించండి. మీ ఆజ్ఞ ప్రకారం శిక్షిస్తాను."

సమర్థ రామదాసు — నేను చెప్పినట్లు తప్పకుండా చేస్తావా?

శివాజీ — నేను తమ ఆజ్ఞను పాలించనా?!

రామదాసు — ఇతడు బీదవాడు. తోట పాడవటం వలన బాధ కలగడం సహజం. కాబట్టి ఇతని దారిద్ర్యాన్ని పోగొట్టడానికి ఇతనికి జాగీరు యివ్వు. అలాగే వంశపారంపర్యంగా అనుభవించే అధికారమివ్వు.

శివాజీ ఆ ప్రకారము వెంటనే దానం చేస్తూ పట్టా వ్రాసిచ్చాడు.

**శ్లో॥ ఉపకారిషు యస్సాధుః**
**సాధుత్వే తస్య కోగుణః I**
**అపకారిషు యస్సాధుః**
**స సాధుః సద్భిరుచ్యతే II**

భావం : తనకు ఉపకారము చేసినవాడికి ఉపకారము చేయడంలో విశేషము ఏమి వున్నది? అపకారము చేసినవానికి ఉపకారము చేసినవాడే సాధువని సత్పురుషులు

చెబుతారు.

ఆ సమయంలో పీఠడియా రాజుగారు అక్కడే వున్నారు. వారి వైపు చూసి శ్రీ ప్రకాశానంద స్వామివారు ఇలా అన్నారు: "ఇట్టి క్షమ మావంటి సన్యాసులకే గాని మీలాంటి రాజులకు కాదు.

*శ్లో॥ క్షమా శత్రౌ చ మిత్రే చ*
*యతీనామేవ భూషణమ్ ।*
*అపరాధిషు సత్త్వేషు*
*నృపాణాం సైవ దూషణమ్ ॥*

భావం : శత్రువులపట్ల, మిత్రులపట్ల క్షమ కలిగి వుండటం యతీశ్వరులకు అలంకారము. అపరాధుల విషయంలో ఆ విధంగా ప్రవర్తించడం రాజులకు తప్పు.

సీతను రావణుడు తీసుకెళ్లినప్పుడు రాముడు ధర్మాత్ముడైనా అతనిని క్షమించలేదు. ఎందుకంటే దుష్టులను దండించడం రాజనీతి.

మనుస్మృతిలో యిలా వున్నది:

*శ్లో ॥ అదండ్యాన్ దండయన్ రాజా*
*దండ్యాంశ్చైవాప్య దండయన్ ।*
*అయశో మహదాప్నోతి*
*నరకం చాధిగచ్ఛతి ॥*

భావం : రాజు శిక్షించకూడనివాడిని శిక్షించినా, శిక్షించాల్సిన వాడిని శిక్షించకుండా విడిచిపెట్టినా గొప్ప అపకీర్తిని పొందడమే గాక నరకాన్ని కూడా పొందుతాడు.

సమర్థ రామదాసస్వామిగారు తమ యతిధర్మాన్ని అనుసరించి క్షమించడమే గాక జాగీరునిప్పించి ఉపకారము చేయడము, శివాజీ గురురాజు ఆజ్ఞ పరిపాలనా తత్పరతతో వారు చెప్పినట్లు చేయడము ఇద్దరికీ ఆభరణమే (అలంకారమే) అవుతుంది.

## ఆర్జవము

ఆర్జవం అంటే నిష్కపటంగా వుండటం. అంతఃకరణంలోను, ప్రవర్తనలోనూ కపటత్వము లేకపోవడమే ఆర్జవము.

సాధువు మనస్సు, వాక్కు, కర్మలలో ఒకేరకంగా వుంటాడు.

*శ్లో॥ ఆర్జవం ధర్మ మిత్యాహుర*
*ధర్మో జిహ్వముచ్యతే ।*
*ఆర్జవేనేహ సంయుక్తో*
*నరో ధర్మేణ యుజ్యతే ॥*

నిష్కపటంగా వుండడం ధర్మము. కపటము అధర్మము. ఆర్జవముతో కూడిన మానవుడు మాత్రమే ధర్మాన్ని అనుసరిస్తాడు.

## జ్ఞానము - విజ్ఞానము

జ్ఞానమంటే సామాన్య జ్ఞానము. విజ్ఞానమంటే విశేష జ్ఞానము. సామాన్యమైన అగ్ని కాష్ఠము మొ॥న వాటిలో వుంటుంది. కానీ అది అంధకారాన్ని పోగొట్టలేదు. ఘర్షణ వలన ప్రకటమైన అగ్ని అంధకారాన్ని పోగొడుతుంది. అలాగే సామాన్య చేతనము అంతటా వ్యాపించివున్నది. అది అజ్ఞానానికి విరోధి కాదు. కానీ వృత్తిరూపమైన విశేష చేతన పదార్థమే అజ్ఞానానికి విరోధి.

ఆ వృత్తి రెండురకాలు. 1) ప్రమ 2) అప్రమ. ప్రమ అంటే యథార్థజ్ఞానము. ఈ ప్రత్యక్ష ప్రమ రెండు రకాలు. 1) బాహ్య ప్రత్యక్ష ప్రమ, 2) అంతః ప్రత్యక్ష ప్రమ. బాహ్యములైన అర్థాలు విషయములుగా కలది బాహ్య ప్రత్యక్ష ప్రమ. అంతరార్థాలు విషయాలుగా వున్నది అంతః ప్రత్యక్ష ప్రమ.

మొదటిదైన బాహ్య ప్రత్యక్ష ప్రమ మానసిక, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ భేదాల చేత ఆరు రకాలు. రెండోదైన అంతః ప్రత్యక్ష ప్రమ రెండు రకాలు - 1)ఆత్మ గోచరము, 2) సుఖాదిగోచరము.

ఆత్మవిషయకమైన ప్రమ ఆత్మగోచరము. సుఖదుఃఖాది విషయకమైన ప్రమ సుఖాది గోచరము.

ఆత్మగోచరము అను ప్రమ రెండు రకాలు 1)విశిష్టాత్మ విషయము, 2)శుద్ధాత్మ విషయము.

**'*అహం జీవః*'** 'నేను జీవుడని' అనే జ్ఞానము కలుగజేసేది విశిష్టాత్మ విషయము. **'అహం బ్రహ్మాస్మి'** 'నేను బ్రహ్మను' అను అభేదజ్ఞానాన్ని కలిగించే ప్రమ శుద్ధాత్మ విషయము.

అప్రమ మూడు రకాలు 1) స్మృతి 2) సంశయము 3) భ్రాంతి.

స్మృతి రెండు రకాలు 1)యథార్థ స్మృతి 2)అయథార్థ

స్మృతి.

యథార్థ అనుభవ సంస్కారము చేత కలిగే స్మృతి యథార్థ స్మృతి.

***సంశయము:*** ఇది వెండి లోహమా లేక ముత్యపు చిప్పా (శుక్తి) అనే జ్ఞానము సందేహము. ఒకే విషయంలో అనేక రకాలైన జ్ఞానాలు కలగడమే సందేహము.

***భ్రాంతి :*** ముత్యపు చిప్పను చూసినప్పుడు అది వెండి అనే భావము కలగడం భ్రాంతి.

## ఆస్తికత్వము

పరమాత్మ సత్యము; స్వర్గనరకాలు, బంధమోక్షాలు సత్యాలు; వేదాలు ఈశ్వరునిచేయబడ్డవి; అనే బుద్ధి ఆస్తికత్వము. ఈ ఆస్తికత్వ బుద్ధి కలవాడు, కర్మను ఉపాసించేవాడు మాత్రమే పరమాత్మ స్ఫురణను పొందుతాడు.

*శ్లో॥ నైవ వాచాన మనసా*
*ప్రాప్తుం శక్యోన చక్షుషా ।*
*అస్తీతి బ్రువతోఽన్యత్ర*
*కథం తదుపలభ్యతే ॥*

భావం : ఆత్మతత్వము వాక్కు చేతగాని, మనసు చేతగాని, కన్నుల చేతగాని గ్రహించ వీలుపడదు. ఆత్మ తత్వము వున్నది అనే ఆస్తికునికి తప్ప నాస్తికునికి అది ఎలా లభించగలదు?

*శ్లో॥ అస్తీత్యేవోపలబ్ధవ్యస్తత్త్వ*
*భావేన చో భయోః ।*
*అస్తీత్యేవోపలబ్ధస్య*
*తత్త్వభావః ప్రసీదతి ॥*

భావం : ఆస్తిత్వ భావంతో ఆత్మతత్త్వము పొందవచ్చు. తత్వ భావంతో కూడా అది పొందవచ్చు. ఆత్మ వున్నది అనేది తెలుసుకునే వాడికే ఆత్మ యొక్క సత్య స్వరూపము ప్రత్యక్షమౌతుంది.

ఇలా బ్రాహ్మణుని స్వభావసిద్ధమైన గుణాలు తొమ్మిది చెప్పబడ్డాయి కదా! ఇందులో ఎన్ని నీలో వున్నాయి?

రాఘవ :- నాలో ఒక్కటి కూడా లేదు. తమ దయ వుంటే రావచ్చు.

ఆ తరువాత నిద్రపోవడానికి వెళ్లేటప్పుడు రాఘవజీ భాయి ఇలా అన్నాడు :-

“నేను రాగానే సన్యాసులను విమర్శించాను. అది మహాత్ములకు సంబంధించినది కాదు. కానీ ఈ రోజులలో ఎక్కడ చూసినా అల్పజ్ఞులు కాషాయ వస్త్రాలు ధరించి నాలుగు అక్షరాలు కంఠస్థం చేసి ఉపన్యాసాలు ఇచ్చి మోసం చేస్తున్నారు. పెద్దపెద్ద వారికి గురువులై కూర్చుంటున్నారు. వారిని తప్పుదోవ తొక్కిస్తున్నారు. వారి విషయంలో నేను అలా చెప్పాను. నా తప్పు మన్నించండి.”

స్వా॥ని॥ :- మీరు చెప్పింది అబద్ధం కాదు. అక్షరాలా నిజము.

ఆ తరువాత ప్రకాశానందులవారిని ఉద్దేశించి ఇలా అన్నారు – మీరే చెప్పండి రాఘవజీ భాయి అబద్ధం చెప్పాడా?

స్వా॥ ప్ర॥ :- విష్ణు పురాణంలో కలియుగాన్ని వర్ణించే సందర్భంలో ఇలా వున్నది –

*శ్లో॥ భైక్ష్యవృత్త్యా తథా శూద్రాః*
*ప్రవ్రజ్యాలింగినోఽధమాః ।*
*పాఖండ సంశ్రయాం వృత్తి*
*మాశ్రయిష్యన్త్యసంస్కృతాః ॥*

భావం : (కలియుగంలో) అధములు, సంస్కారహీనులు, శూద్రులు సన్యాసి వేషధారులై భిక్షావృత్తిని ఆశ్రయిస్తారు. పాఖండాచారులవుతారు.

బృహన్నారద పురాణంలో కలియుగ వర్ణన సందర్భంలో ఇలా వున్నది —

*శ్లో॥ కాషాయపరివీతాశ్చ*
*జటిలా భస్మధూళితాః ।*
*శూద్రా ధర్మాన్ ప్రవక్ష్యంతి*
*కూటయుక్తి పరాయణాః ॥*

భావం : శూద్రులు కాషాయ వస్త్రాలను, జటలను ధరించి భస్మము పూసుకుని సంకుచితమైన కుయుక్తి కలవారై ధర్మాలను చెబుతారు.

కపటులు కొంతమంది ఆడంబరము కోసము గుండు చేయించుకొని, సన్యాసము పుచ్చుకొని, పెద్దపెద్ద రుద్రాక్షలు ధరించి భగవద్గీత, ఉపనిషత్తులు మొ॥న వేదాంత గ్రంథాలను గురించి ఉపన్యసిస్తారు. అందుకోసం ధనం

సంపాదించి మఠాలను, మందిరాలను కట్టిస్తారు. సకల భోగాలు అనుభవిస్తారు.

మరి కొంతమంది కఠిన సన్యాసము తీసుకొని అక్కడక్కడా కూర్చుని సంపాదిస్తారు. మఠాలను కట్టించి తమలో తాము వైరాలను పెంచుకుంటారు.

ఇంకా కొంతమంది భస్మాన్ని ధరించి పంచాగ్నులను వెలిగించి రామాయణాదుల కాలక్షేపము చేస్తారు. రకరకాల మార్గాలలో కపటనాటకాలాడి అజ్ఞానులను వలలో వేసుకుంటారు.

ఈ విషయంలో తుకారాం కూడా తమ అభంగలో ఇలా చెప్పాడు —

"పురాణాది కాలక్షేపాలు చేసే మానవుల మనసులలో ఆశ, తృష్ణ వున్నప్పుడు వినేవారి మనసులలో కూడా ఈ శాస్త్రులుగారు లేక హరిదాసుగారు మనలను ఏమీ అడగకుండా వుండరనే భయము కలుగుతుంది. దాసుగారు ఏమి చెబుతున్నా వారి లక్ష్యము దానియందు వుండదు. వారి ప్రతి మాట వినేవారి నుండి ధనాన్ని సంపాదించే వైపుకు మొగ్గివుంటుంది. కథ చెప్పేవారు దురాశపరులు, వినేవారు పిసినారివారు. ఈ స్వభావము కలవారి బ్రతుకు పిల్లి లాంటిది. పిల్లి ఇంటింటికి వెళ్లి కడుపు నింపుకుంటుంది. వారు చేసే భజన మొ॥నవన్నీ వ్యర్థమే. వినేవాడికి గాని చెప్పేవాడికి గాని ఏమీ ఉపయోగం వుండదు. ఒక చెవిటివాడు, మూగవాడు కలిస్తే ఏ పని చేయలేరు కదా! అలాగే పైన చెప్పిన రకం శ్రోతలు, వక్తలు (వినేవారు, చెప్పేవారు) కూడా అసమర్థులు. కళ్ళములోని ధాన్యము కాటాపైన తూచబడనంతవరకు తూచేవాడి తూకపురాళ్ళు, ధాన్యము - రెండూ నిరుపయోగము

నోటితో కథలు చెప్పే వారి మాటలు పైకి ఎంతో తీయగా వుంటాయి. కానీ వారి మాటలను అనుసరించి వారి మానసిక స్థితి వుండదు. వారి మాటలు నేతి బీరకాయ లాంటివి. ఈ అబద్ధాలకోరులకు, డాంబికులకు ఈ ప్రపంచంలో ఏమాత్రమూ సుఖము కలుగదు. ఇక పరలోకము సంగతి చెప్పేదేముంది? మాటలు, చేతలు సమానంగా వుండి పరమార్థం విషయంలో మచ్చరానివ్వని మనుష్యులకు నేను నమస్కారము చేస్తాను.

కొంతమంది హరికథ చెప్పే సమయంలో ఎంతో భక్తిని, భగవంతునిపై ప్రేమను ప్రకటిస్తారు. కానీ వారి మనసులు పాపపు పనులు చేయడంలో ఆసక్తితో నిండివుంటాయి. వారి చెవిలో తులసీదళం వుంటుంది. శిఖలను దర్భలతో కట్టుకుంటారు. ఇలా పై అట్టహాసాలతో ముక్కు మూసుకుని ధ్యానం చేస్తున్నట్లు అభినయం చేస్తారు. శరీరాన్ని ద్వాదశ ఊర్ధ్వ పుండ్రాలతో (12 నిలువు బొట్లతో) అలంకరిస్తారు. భక్తుల వేషము వేసుకుంటారు. మెడలో తులసీమాల వేసుకుంటారు. దేవుని ఎదుట ఎంతో బాగా కథ చెప్పటానికి కూర్చుంటారు. కథ చెబుతూ మధ్య మధ్య ఏడుస్తారు, నవ్వుతారు, మూర్ఛ పోతారు, ఆనంద భాష్పాలు రాలుస్తారు. అటువంటి వారందరూ అబద్ధాలకోర్లు, మోసగాళ్లు. దేవుని యందు సగం దృష్టి, స్వార్థమందు సగం దృష్టి కలిగి వుంటారు.

కలియుగంలోని కవులు కూడా పాఖండులే. కబుర్లు చెప్పేవారు, బూతు కవులు ఈ కాలంలో గొప్ప కవులుగా పరిగణింపబడుతున్నారు. వారి మనసు ధనములోనో, స్త్రీ యందో లేక బిడ్డల యందో తగుల్కొని వుంటుంది. నోటి నుంచి వైరాగ్యపు అసత్య ప్రసంగాలు వెలుడుతూవుంటాయి. ప్రజల నుండి గౌరవం పొందడానికి సాధుత్వాన్ని ప్రదర్శిస్తారు. కవిత్వపు నోటి నుంచి త్యాగ వైరాగ్యాలతో నిండిన అలంకార భూయిష్టములైన రచనలు వస్తాయి. కానీ అవన్నీ డాబులు మాత్రమే! వారి నోరు మాట్లాడిన దానిలో ఒక వంతు అయినా వారి మనసులలో వుండదు. ఆత్మ శరీరానికి, ఇంద్రియాలకు అతీతమని; దేహానికి నిర్లిప్తంగా వుండడం వలననే ఆత్మస్థితి సిద్ధిస్తుందని వేదాలు చెబుతాయి. ఆ మాట నిజమే. కానీ ఈ ఆత్మోపదేశకులు ఆ ప్రకారము ప్రవర్తించరు. ఇటువంటివారు చివరకు యమభటుల పాలౌతారు. వారి మాటలకు, చేతలకు సంబంధము లేకపోవడమే ఇందుకు కారణము.

కొంతమంది సాధువుల వేషం ధరించి అనేక మందిని మోసము చేస్తారు. వారి నుండి డబ్బు దండుకుని తమ కుటుంబాన్ని పోషించుకుంటారు. పంజరంలోని చిలుకలు మనిషి మాటలు మాట్లాడినట్లు, ఈ మోసగాళ్లు పలికి తమ సంభాషణల ద్వారా స్త్రీ పురుషుల మనస్సులను సంతోషపెడతారు. గంగిరెద్దుల లాగా గురువు చెప్పినట్లు బుర్ర ఊపుతారు. సూత్రధారుడు చెప్పినట్లు నటులు నటించినట్లుగా వారు తమ గురువు చెప్పినట్లు బ్రహ్మజ్ఞానోపదేశాలను పలుకుతూ తిరుగుతారు. ఈ పనికిరాని వాళ్లను ఏమన్నా వారికి సిగ్గు రాదు. వారి మహత్యం కాల్చనా!?

మాట్లాడే సమయంలో వారు అంతులేని బ్రహ్మజ్ఞులు అనిపిస్తారు. కానీ మనసును గౌరవానికి, ఆశకు దాసిగా వినియోగించుకుంటారు. కడుపు నింపుకోవడానికి వేషం వేసికొనే తుంటరులు కలియుగంలో చాలామంది వుంటారు. సరైన సత్పురుషులు కొంతమంది మాత్రమే వున్నారు. అటువంటి వారికి సాష్టాంగ నమస్కారము చేస్తాను" అని తుకారాము చెప్పారు.

రాఘవ : తుకారాం చరిత్ర చదివితే ఆయన చాలా కోమల హృదయుడు అనిపిస్తాడు. కానీ ఈ పై అభంగలో ఆయన ఇంత కఠినంగా ఎందుకు చెప్పారు?

స్వా॥ప్ర॥ :- ధర్మాత్ములు అధర్మాన్ని చూసి సహించలేరు. కాబట్టి తీవ్రమైన పదజాలంతో ఉపన్యసిస్తారు. దీనిలో ఆశ్చర్యమేమీ లేదు. ఏసుక్రీస్తు ఎంతో కోమల హృదయుడు, దయాసముద్రుడు. అయినా యూదు మత గురువులు దేవాలయాలలో దుకాణాలు పెట్టుకొని కూర్చున్నప్పుడు వారిని ఆపడానికి వెళ్ళాడు. అది మత గురువులకు నచ్చలేదు. అప్పుడు వారు అతని మీద అసహ్యముగా నేరారోపణ చేసి క్రూరత్వముతో ఆయనను సిలువ వేశారు. అప్పుడు కూడా 'ఈ మత గురువులను క్షమించమని' ఆయన దేవుని ప్రార్థించాడు.

ఇంత దయార్ధ్ర హృదయుడైనా గూడ ఆయన ధర్మస్థలాలలో జరుగుతున్న అధర్మాలను చూసి తమ శిష్యులకు ఏమి ఉపదేశించాడో చూడండి!--

"గొప్పవారమనుకునే ఈ మతగురువులు ధర్మాసనం మీద కూర్చొని ధర్మాలను చెబుతున్నారు. వారు ఆజ్ఞాపించినట్లు చేయండి. వారు చేసినట్లు చేయకండి. ఎందుకంటే ఆ విధంగా వారే ప్రవర్తించడం లేదు. అందరి చేత వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. వారికి ఏమాత్రం సహాయము చేయడం లేదు. ఇతరులు చూడడం కోసం మాత్రమే వారు తమ తమ పనులన్నీ చేస్తున్నారు. వారు తమను తాము పొగుడుకోవడంలో నిమగ్నులై వుంటారు. విందు భోజనాలలోను, సభల లోను అగ్రాసనాలు వారివి. అందరూ తమకు నమస్కారం చేసుకోవాలని వారికి కోరిక. అందరూ వారిని మతగురువులని అనాలని వారి కోరిక. కానీ 'వారు మతగురువులు కాదు!' అనకండి. అందరికీ దేవుడు ఒక్కడే గురువు. మీరందరూ సోదరులు. భూమిమీద వున్నవాడెవడూ మీకు తండ్రి కాదు. ఆకాశంలో వున్న ఆ ఒక్కడే మీకు తండ్రి. వీరెవరూ మీ యజమానులు కారు. ఆకాశంలో వున్న ఆ ఒక్కడే మీ యజమాని. తాను గొప్పవాడిననుకునేవాడు మీ సేవకుడు. తాను గొప్పవాడవ్వాలని భావించేవాడు క్రిందికి పోతాడు. తాను కిందనుండాలనుకునే వాడు గొప్పవాడౌతాడు."

ఆ మతగురువులను ఏసుక్రీస్తు ఎలా విమర్శించాడో చూడండి! -

"ఓ కపటులారా! మీరు ఎంత తెలివిమాలినవారు?! ప్రజల నుండి వారి స్వర్గ రాజ్యాన్ని దూరం చేశారు. అక్కడికి మీరు వెళ్ళలేదు. మీరు వెళ్ళలేని చోటికి ఎవరైనా వెళ్లాలనుకున్నా వారిని వెళ్ళనివ్వరు."

మరొకచోట బైబిలు లో ఇలా చెప్పారాయన:-

"ఈ అసత్య ప్రచారకులు దొంగవేషాలతో మీ దగ్గరకు వస్తారు. వీరు స్పృహ తప్పించే మద్యములాంటివారు. వీరి నుండి జాగ్రత్తగా వుండండి. వారి వలన కలిగే ఫలితాన్ని బట్టి వారిని గుర్తించవచ్చు. ముళ్ళ పొదల నుంచి ద్రాక్ష గుత్తులు వస్తాయా? ప్రతి మంచి చెట్టూ కూడా మంచి ఫలాన్ని యిస్తుంది ప్రతి చెడ్డ చెట్టు చెడు ఫలాన్నిస్తుంది. మంచి చెట్టు చెడుఫలాన్ని ఇవ్వలేదు.

స్వా॥ప్ర॥ :- తాత్పర్యమేమంటే ఆ దొంగలకు గౌరవం పొందాలని కోరిక వుంటుంది. ప్రజలకు ఏదైనా మంచి ఉపదేశాన్నిచ్చి బాగుచేయడం వారి ఉద్దేశ్యం కాదు. గ్రామాన్ని రక్షించడానికి గ్రామాధికారులు 'మేల్కొనండి' అని దండోరా వేయిస్తే లాభం వుంటుందా? అలాగే అసురప్రకృతి కలవాడు అధర్మము తప్పని ఎన్నివిధాల చెప్పినా దానిని ఆపలేరు. సత్పురుషులు మాత్రమే అజ్ఞానంలో మండిపోతున్న ప్రజలను అధర్మం నుండి రక్షించడానికి అవసరమైన సూచనలనన్నింటినీ చేయగలరు.

స్వా॥ని॥ :- క్రీస్తు అంత కాఠిన్యంతో చెప్పింది కూడా ప్రజల పట్ల కరుణ వల్లనే! పిల్లవాడు దిగుడు బావి దగ్గరకు వెళ్లేటప్పుడు తండ్రి వాడిని కోపంతో ఆపుతాడు. అలా చేయడం వాడి పట్ల ద్వేషంతో కాదు కదా! దయ వలననే! అలాగే శరీరం మీద తేలుపాకుతుండగా చూసి నిద్రలేపటం అతనికి ఉపకారం చేయడానికే. కబీరు, తుకారాము అభా మొ॥న సత్పురుషులందరూ చెప్పేవి మన మేలు కోసం మాత్రమే. వారు మనకు ఎంతో ఉపకారం చేసినట్లే భావించాలి.

- సశేషం

# బుద్ధ ధ్యాన హృదయము

(గత సంచిక తరువాయి)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## అధ్యాయం - ౨

### ౨. శుద్ధ అవగాహన :-

కేవలశ్రద్ధ సాధనేతర సమయాలలో నిత్యజీవితంలో పరిమిత కాలం మాత్రమే నిలుపుకోవటం సామాన్యులకు సాధ్యమౌతుంది. నిత్యజీవితంలో యెన్నో క్రియలు, మాటలు, తలంపులు చేయక తప్పదు. సాధనలోని ప్రశాంతస్థితిని విడచి యితరులతో సంపర్కం చెందడం మరలా మరలా ఆవశ్యకమౌతుంది. మనస్సుకు ఆలోచించడం, నిర్ణయాలు చేసుకోవడం తప్పదు.

ఇట్టి నిత్య జీవితాన్ని తన క్రియారంగంగా కలిగియుంటుంది సమ్యక్ స్మృతిలోని రెండవ అంశమైన శుద్ధ అవగాహన (సంప్రజ్ఞాన). క్రమంగా దీని సహాయంతో మన మనోవాక్కాయాలను నియమించుకోవడానికి ఉపయోగించుకోవాలి. మనోవాక్కాయ కర్మలను సార్థకంగాను, సమర్థవంతంగాను, మన ఆశయాలకు, అవగాహనకు నూతనంగా కలిగిన అవగాహనకు అనుగణంగాను మార్చుకోవాలి. సమ్యక్ స్మృతిని ఆధారంగా చేసుకొనిన జ్ఞానము, లేక ప్రజ్ఞయే సంప్రజ్ఞానము. ఇది నాలుగు విధాలు :

#### *1) శుద్ధ లక్ష్యావగాహన (సార్థక సంప్రజ్ఞానము) :*

మానవుడు తార్కికశక్తి కలవాడు గనుక అతడి క్రియలన్నీ సహేతుకంగా (అంటే సార్థకంగా) వుంటాయి అనుకొంటాము. కానీ, పరిశీలించిన మీదట మానవులెల్లప్పుడు సహేతుకంగానే ప్రవర్తిస్తారని చెప్పలేము. స్వార్థపూరితమైన ప్రాపంచిక విషయాలలో గూడ మానవుడు తరచు తన లక్ష్యాన్ని, పథకాన్ని, ప్రయోజనాలను గూడ మరచి క్షణికమైన రాగద్వేషాలకు, సోమరితనానికి గురియై నిరర్థకమైన క్రియాకలాపంలో చిక్కుకొని పెడదారి పడతాడు.

బాహ్యాభ్యంతర విషయాల గూర్చిన తన భావాల తాకిడి వలన జీవితపంథా నుండి ప్రక్కకు తొలగడం అసమంజసము, తప్పు మరీను. అయితే యిలా ప్రక్కదారి పట్టే స్వభావాన్ని పరిమితం చేసుకొని వాటిని సంపూర్ణంగా నివారించుకోడానికి యత్నించుకోవడం అవసరము. మహనీయులకే యిది సంపూర్ణంగా సాధ్యం. ఈ బలహీనతను అధికార పూర్వకమైన ఆదేశాలద్వారా గాని, శుష్కమైన హేతువాదం ద్వారాగాని, ధర్మపన్నాలను వల్లించడం ద్వారా గాని తగ్గించనూలేము, నిర్మూలించనూలేము. అలా చేస్తే యేదో ఒకనాటికి యీ బలహీనతకు ఆధారమైన భావోద్రేకాలు తిరుగుబాటు చేసి అసంబద్ధమైన ప్రవర్తన రూపంలో ప్రకటమౌతాయి. (కృత్రిమంగా శాంతిని నిలుపుకున్నవాడు ఒక్కసారిగ తీవ్రమైన చీకాకుకు, కోపానికి గురియైనట్లు). వీటిని అర్థం చేసుకొని మన లక్ష్యసాధనకు అనుగుణంగా మలుచుకోడానికి యత్నాన్ని కేవలశ్రద్ధ సాధన నుండి ఆరంభించాలి. అది మనలను ప్రతిఘటించే యీ శక్తులను కలిగించి లక్ష్యసాధన కనువైన రీతిగా మార్చుకుంటుంది. మనలోని వివిధ గుణాలను, కోరికలను, క్రియలను సమన్వయ పరచుకోవటం క్రమబద్ధము సహజము అయిన ఆత్మనిగ్రహము ద్వారా

మాత్రమే సాధ్యము. ఇట్టి యింద్రియ మనోనిగ్రహానికి కేవలశ్రద్ధే భద్రమైన ఉపాయము. విషయగ్రహణ క్రియకు దారితీసేలోగా విరామాన్ని కల్పించటం ద్వారా సార్థక సంప్రజ్ఞానికి పనిచేసి అవకాశం కల్పిస్తుంది. అంతేగాక శుద్ధ అవగాహనకు అవసరమైన శుద్ధ విషయజ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. తద్వారా తన లక్ష్యమునుండి ప్రక్కకు తొలగి అసంతృప్తికి గురికానక్కర లేకుండా చేస్తుంది.

అలాకాక పాత అలవాటు ప్రకారం మనస్సును లక్ష్యం నుంచి ప్రక్కకు పోనిస్తే క్రమంగా శక్తి, ఓరిమి, ఏకాగ్రత బాగా క్షీణించి లక్ష్యం యొక్క విలువను గూడా మరిచేలా చేస్తుంది. అలా అసలు లక్ష్యాన్ని మరిచి దాని సాధన కలాపాన్ని యాంత్రికంగా మాత్రమే అలవాటు చొప్పున నిర్వహిస్తూ వుండే యెందరో వ్యక్తులను మనం చూడవచ్చు. సార్థక సంప్రజ్ఞానము ఈ ప్రమాదాన్ని నివారిస్తుంది. మనోవాక్కాయాలను వ్యర్థమైన క్రియాకలాపాలలో శక్తిని ఖర్చు చేయనివ్వక ఆత్మనిగ్రహానికి దోహదం చేస్తుంది. అన్ని క్రియలను తన లక్ష్యాని కనుగుణంగా మలుచుకొనే శక్తికేంద్రాన్ని మనలో యేర్పరుస్తుంది. లక్ష్యసాధనకనువైన కర్మలనే యెన్నుకొనే నిశ్చయశక్తిని, అవగాహనను, సాధనలో పట్టుదలనూ యిస్తుంది. ఒక్కసారికి దుఃఖం యొక్క వాస్తవికతను సంపూర్ణంగా అర్థం చేసుకుంటే దానిని వృత్తి పదాన్ని అవలంబించటం జీవితము యొక్క యేకైక లక్ష్యమన్న నిశ్చయ దారుఢ్యం కలుగుతుంది.

*2. సోపాయ సంప్రజ్ఞానము లేక ఉపాయాన్నెఱుగుట :*

అన్నిటికంటే ఉత్తమమైన పంథానెన్నుకోవడం సర్వదా సాధ్యం కాదని మన సామర్థ్య పరిమితిని, పరిస్థితిని అనుసరించి గుర్తించటమే సోపాయ సంప్రజ్ఞానము. దేశకాల సామర్థ్యాలకనుగుణమైన పంథానెన్నుకొనే నైపుణ్యమే యిది. గుడ్డిగా, మొండిగా యెన్నుకొన్న పంథా ననుసరించి అపజయాన్ని, నిరుత్సాహాన్ని పొందే ప్రమాదాన్ని, అది తెలియక లక్ష్యాన్నే శంకించే ప్రమాదాన్ని నివారిస్తుంది.

*3. గోచర సంప్రజ్ఞానము :*

నిత్య జీవితంలో మనస్సును లక్ష్యానుగుణంగా సంకీర్ణం చేసుకొనే ప్రజ్ఞ మనలో వ్యక్తిత్వము లేక 'నేను' అనబడే వస్తువే తదను శ్రద్ధ, నిరంతర జ్ఞానమే అసమ్మోహ సంప్రజ్ఞానము అను నాలుగవ అంశము. ధ్యేయ విషయాన్ని యెప్పుడూ అంటిపెట్టుకొని యుండడమే గోచర సంప్రజ్ఞానమని పెద్దలు వ్యాఖ్యానించారు. ఇందులో రెండంశాలున్నాయి.

1) ఒకే వస్తువును ధ్యానించేప్పుడు మన నిత్యజీవితంలోని క్రియలన్నింటితోను దానిని సమన్వయించుకోవాలి. అంటే మనం జేసే పనిని మనం ధ్యానించే సత్యానికి ఉదాహరణగా అన్వయించుకోవాలి. ఉదాహరణకు తినటమనే క్రియను శరీరం యొక్క అనిత్యత్వాన్ని అది నాలుగు భూతాల చేత చేయబడి వుండడాన్ని ధ్యానించడంతో సమన్వయపరచుకోవచ్చు. ధ్యానము, నిత్యజీవితము సమన్వయపడి ఉభయతారక మౌతుంది. ఒక్కొక్కప్పుడు మనం చేయవలసిన పని ధ్యానంతో సమన్వయపడినదిగా వుండవచ్చు. అటువంటప్పుడు ఆ పని ఆరంభించే ముందు బుద్ధిపూర్వకంగా పక్కకునికి పని అవగానే తిరిగి ధ్యేయాన్ని మనస్సులో వహించాలి. ఇదికూడా ధ్యేయాన్ని మరువక పోవడమే అవుతుంది.

2) సర్వతోముఖమైన స్మృతిని నిలుపుకోవడమే సాధనగా పెట్టుకొన్నపుడు ధ్యానాన్ని నిలుపుకోవలసిన ఆవశ్యకతే వుండదు. క్రమంగా మానసిక, వాచక కార్యాలన్నీ స్మృతి సాధనలోకి యిముడ్చుకోవాలి. చివరకు ధ్యేయం నిరంతరం నిలచి వుంటుంది. ఇందులో యెవరెంత సాఫల్యాన్ని పొందుతారో అన్నది వారి సమయస్ఫూర్తి మీద, అలవాటుమీద, అభ్యాసబలంమీద ఆధారపడుతుంది. జీవితము, సాధన ఒక్కటిగా చేయడమే సాధనకు లక్ష్యం అయి వుండాలి. సాధనే సంపూర్ణ జీవితం కావాలి. ఈ సమ్యక్ స్మృతి సాధన యొక్క గోచరము సరిహద్దు నిరంతరమూ పెరుగుతూ నిరంతరం నూతన జీవితాంశాలను తనలో యిముడ్చుకుంటుంది.

ఈ సాధనచేసేవాడు యెల్లప్పుడు "యీ పరిస్థితులలో స్మృతిసాధనను యెట్లా కొనసాగించుకోవచ్చు?" అని ప్రశ్నించుకుంటూనే వుండాలి.

ఈ సాధన అనుకొన్నంత తేలిక కాదు. అయితే సార్థక సోపాయ సంప్రజ్ఞ సాధనాల ద్వారా అవరోధాలను

అతిక్రమించవచ్చు.

*4) అసమ్మోహ సంప్రజ్ఞానము :*

వాస్తవాన్ని పరిశుద్ధంగా అవగాహన చేసుకున్నప్పుడు భ్రమలన్నింటికీ మూలమైన 'నేనొక వ్యక్తిని' జీవిని అని వస్తువుల యదార్థమైనవన్న భ్రాంతి తొలగుతుంది. ఈ భ్రాంతి రాగద్వేషాలకు కారణమై దుఃఖభూయిష్టమైన సంసార చక్రానికి జీవులను బంధించి తిప్పుతుంది. మొదటి మూడు విధములైన సంప్రజ్ఞాన క్రియలకు అన్యంగా, వాటికాధారంగా నేను, జీవుడు మొదలైన తత్వమేమీ లేదన్న జ్ఞానాన్ని యెప్పుడూ కలిగియుండడమే అసమ్మోహ సంప్రజ్ఞానము. ఆచరణలో అడుగడుగున అలవాటుగా తలెత్తే నేను, నావి అనే భావాలు యీ సాధనకు అతి తీవ్రమైన బంధకాలు. వీటిని జయించడంలో అసమ్మోహ సంప్రజ్ఞానము ముఖ్యము. పై మూడురకాల సంప్రజ్ఞానము దీనికీ విషయంలో సహకరిస్తాయి. అనుక్షణము తలెత్తే తలంపులు, భావాలు, వ్యక్తిత్వరహిత క్రియలుగా గుర్తించడమే సాధన.

మహాత్ముల వల్ల తప్ప తక్కిన వారిలో వారివారి పరిపాకాన్ని, దృక్పథాన్ని అనుసరించి యీ సాధనలో వివిధమైన భావోద్రేకాలు తలెత్తుతాయి. ఈ జీవితము, సృష్టి తత్వము ఒక నూతన విధానంగా దర్శనమిచ్చి, వాటిపట్ల సాధకుడి వైఖరి పూర్తిగా మారిపోతుంది. ప్రాచీనులు, ఆధునికులు అయిన సాధకులు యీ సాధనలో తమకు ఆనంద పారవశ్యం దగ్గర నుండి పరమశాంతి వరకు యెన్నో విధానాలైన అనుభవాలు కలిగాయని, నేను, నావి అనే ఉక్కు బంధనాలనుండి వాటి నాధారం చేసుకొన్న యితర వికారాల భారం నుండి విడుదలైన స్వేచ్ఛ సాటిలేని ఆనందంగా అనుభవమౌతుంది.

మొదటి మూడు విధాలైన పరిశుద్ధావగాహన సాధనలో కేవలశ్రద్ధ అనెడి భద్రమైన 'ప్రశాంతస్థితి'ని వీడి నిత్యజీవితానికి సంబంధించిన క్రియాకలాపంతో తలపడతాడు సాధకుడు. ప్రతి పని తనను యితర క్రియ, ప్రతిక్రియల వలయంలోకి లాగే తత్వం గలవి. అంటే ప్రపంచంలోకి లాగేది అని తెలుసుకుంటాడు. ప్రతి పని కొత్త పథకాలు, లక్ష్యాలు, కర్తవ్యాలు వలయంలోకి లాగుతుందని మొదటి మూడు సంప్రజ్ఞాన సాధనలలోను గుర్తిస్తాడు. అంటే కేవలశ్రద్ధా సాధనలో తాను సాధించిన శాంతి నంతటిని కోల్పోయే ప్రమాదానికి గురౌతాడు. అట్టి పరిస్థితిలో అసమ్మోహ సంప్రజ్ఞానం సహకరిస్తుంది. 'లోపల యీ కర్మలను, తలంపులనూ చేసే స్థిరమైన వ్యక్తిత్వ మనేది లేదు. ఈ కర్మలకు గురియయ్యే సత్యమైన వస్తువు వెలుపలా లేదు' అన్న విషయాన్ని అన్ని కార్యాలలోనూ గుర్తించుకొంటే, యివి నేను చేసే క్రియలు, యివి నేను అనుభవించే ప్రతిక్రియలు అనే భ్రమకు దూరమై వాటిల్లోని జయాపజయాలు, నిందాస్తుతులు అనెడి భ్రాంతి తొలగిపోతుంది. సార్థక సంప్రజ్ఞానాన్ని అనుసరించి, సోపాయ సంప్రజ్ఞానమును అనుసరించి చేయదగిన కర్మను నిర్ణయించుకున్నాక దాని ఫలితం కోసం కూడ, దాన్ని ఆ రీతిన చేయడమే లక్ష్యంగా పెట్టుకొని సాధకుడు ఆచరించగలుగుతాడు. 'తన', 'యితరు'ల గురించి, కర్మ ఫలాన్ని గురించి ప్రక్క యోచన లేకుండా యేకాగ్రతతో చేయబడిన యీ కర్మ ఆ కారణంగా ఫలించే అవకాశం మరింత యెక్కువ వుంటుంది. కీర్తి, విజయము మొదలగు కర్మఫలాలయందుగల కోరికే ఆయా ఫలితాల కోసం మరింత కార్యకలాపంలో చిక్కుపడేలాగా చేస్తుంది. అంతేగాక ఆ కోరికే 'నేను కర్తను', 'నేను భోక్తను' అనే భావాలను బలపరుస్తుంది. నాలుగు విధములైన సంప్రజ్ఞ వీటన్నింటికి మూలమైన మోహాన్ని నశింపజేస్తుంది. కర్మబంధాలతో నిండిన యీ ప్రపంచంలో వుండగానే ఆ బంధాలనుండి విముక్తినిస్తుంది సంప్రజ్ఞ. అంటే కర్మలో అకర్మనిస్తుంది అసమ్మోహ సంప్రజ్ఞ. అంటే కర్మలో అజ్ఞాన బంధం నుండి స్వేచ్ఛనిస్తుంది, (అంటే) కర్మలో స్వేచ్ఛనిస్తుంది కేవలశ్రద్ధ. ఈ విధంగా అసమ్మోహ సంప్రజ్ఞ జీవితాన్నంతటినీ సాధనగా మారుస్తుంది. ఇటువంటి సంప్రజ్ఞతో నిండిన ప్రతి చిన్నపని గూడా ముక్తికి దోహదమౌతుంది. అందుకే పెద్దలు చెప్పారు : "దేని మీదనైనా మనస్సును కేంద్రీకరింపజేసే ధ్యాన పద్ధతి అవసరం. ప్రతి క్రియని ముక్తి పథం మీద ఉపకరణంగా మార్చుకొనే సామర్థ్యంగల జీవిత కళ అవసరం" అని. ఇటువంటి ధ్యానపద్ధతి, జీవనకళ స్మృత్యుపస్థాన సాధనలో వున్నది. సమ్యక్ స్మృతి సాధన నిస్వార్థమూ, లోకహితమూ అయిన కర్మను జ్ఞానదృష్టిలో సోపాయంగా చేసే నైపుణ్యాన్నిస్తుంది.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

**శ్రీమతి శ్రీదేవి**

అసమాన ప్రజ్ఞావంతులు, దైవీగుణ సంపన్నులు శ్రీ అనంతాచార్య భవిష్యత్తును గురించి ప్రజ్ఞ కలిగి వుండటం ఆ కాలపు ప్రజలెందరో గుర్తించగలిగారు. ఎన్నోసార్లు భవిష్యత్తులో జరుగబోయే విషయాలు ఆయన నోటినుండి వెలువడుతుండేవి. ఉదాహరణకు ఒకసారి వీరు కొందరితో కలసి రైలు ప్రయాణం చేస్తుండగా వారి సంభాషణలలో గాంధీగారి ప్రసక్తి వచ్చింది. భవిష్యత్తులో గాంధీగారు చేయబోయే కార్యక్రమాలు, ప్రణాళికలు గురించి చర్చించుకొంటున్నారు. అప్పుడు ఆచార్యులవారు "అవేవీ జరుగవు. ఎందుకంటే గాంధీగారు యిక వుండరు" అన్నారు. అక్కడి వారంతా ఆయన మాటలను ఏ మాత్రం నమ్మలేదు. సరిగ్గా మరుసటి రోజు మధ్యాహ్నం గాంధీగారు హత్య చేయబడ్డారనే వార్త వెలువడింది.

ఆయన వద్దకు వచ్చే రోగులను చూడగానే వారికి వచ్చిన వ్యాధి ఏమిటో వారు చెప్పకముందే ఆయనకు స్ఫురించేది. ఆ వ్యాధి ఎన్నాళ్ళకు తగ్గుతుందో, వారు ఎంతకాలం జీవిస్తారో గూడా ఆయనకు స్పష్టంగా తెలిసేది.

శ్రీ అనంతాచార్యుల వారిలోని మరొక విశిష్టత – కీర్తికాంక్ష లేకపోవటం. ఆయన జీవితాన్ని అందరివలె గడుపలేదు. ఒక తపస్సుగా ఒక సాధనగా తమ జీవితాన్ని కర్తవ్య నిర్వహణకు, పరోపకారానికి అంకితం గావించారు. తమ శ్రమను, యావత్ శక్తినీ లోకానికి ధారపోశారు. తాము ఎంతో కృషి చేసి, ఎన్నో ప్రయోగాలు చేసి సాధించిన వైద్యవిద్యా విధానాలను, నైపుణ్యాన్ని, పరిజ్ఞానాన్ని అంతటినీ వైద్యవిద్యపై ఆసక్తి చూపించిన వారికి ఉచితంగా బోధించారు. వైద్యవృత్తి ద్వారా ఆర్జించిన లక్షలాది రూపాయల ధనాన్ని పేదసాదలకు పంచేశారు. తల్లి, తండ్రీ, గురువు అన్ని పాత్రలూ తామై కష్టపడి ప్రాణప్రదంగా పెంచుకున్న తమ నలుగురు కుమారులను ప్రయోజకులుగా చేసి, లోకోపయోగ మహనీయులుగా తీర్చిదిద్ది, వారి సేవలను లోకానికి అంకితం చేశారు.

ఇంత చేసి కూడా ఎవరినుండీ ఎటువంటి కృతజ్ఞతగానీ ప్రతిఫలాన్ని గానీ ఆశించలేదు.

ఆశ్చర్యమేమంటే, పేరు ప్రతిష్టల బాజా భజంత్రీలు, కీర్తి పతాకపు రెపరెపలు ఆయననేమాత్రం ఆకర్షించలేదు. వారు స్తుతులను ఆశించలేదు, కీర్తనలను పాడించుకోలేదు. నలుగురిని ప్రోగుచేసి వేదికలెక్కి పొగడ్తల పూలవర్షాలను కురిపించుకొనలేదు. తమ గొప్ప చేతల గుర్తింపుకై ఆయన అణుమాత్రమైనా ప్రాకులాడలేదు. మౌనంగా, నిర్లిప్తంగా ప్రజాసేవ చేసి గుప్తయోగిగా మిగిలిపోయారు.

లోకాన్ని వెలుగులతో నింపుతూ మైనపువత్తి తాను కరిగి కరిగి అదృశ్యమై పోతుంది. అదేవిధంగా శ్రీ అనంతాచార్య ప్రజాసేవ కంకితులై ప్రతిఫలాన్ని కోరక రిక్తహస్తాలతో నిలచిపోయారు.

అందువల్లనే భగవంతుడికి అత్యంత ప్రీతిపాత్రులయ్యారు. అందువల్లనే శ్రీ అనంతాచార్య తమను ఆరాధించకున్నా, ఆహ్వానించకున్నా, శ్రీ సాయినాథుడు ఆయనపై ప్రేమతో తమకై తామే ఆయన వద్దకు నడచి వచ్చి "నాకిదే ప్రియమైన చోటు" అంటూ, "నేనెన్నటికీ నీ హృదయమందిరాన్ని వీడిపోనంటూ" ఆయన గుండె గుడిలో పదిలంగా ప్రతిష్ఠితులైనారు. ఆ విధంగా శ్రీసాయినాథుడిని తమలో, తాము శ్రీసాయినాథునిలో మమేకమై శ్రీ అనంతాచార్య అజరామరులై కృతార్థతనొందారు.

ఆ నిరాడంబర, నిష్కపట, నిర్మలాంతఃకరణులు,

మహాపండితులు, అభ్యుదయవాది, సదాచరణసంపన్నులు, పవిత్రహృదయులు, సహనశీలి, పేదలపాలిటి పెన్నిధి, కార్యశూరులు, కర్మయోగి, దైవీగుణ సంపన్నులు, భగవచ్చింతనా తత్పరులు అయిన శ్రీ అనంతాచార్య జీవనశైలి తుది వరకు మార్పు చెందక ఒకేవిధంగా కొనసాగింది. నలుగురు కుమారులను పెంచి, పెద్దచేసి, వారిని యోగ్యులుగా చేసి, వారిని జీవితాలలో స్థిరపరచటం మాత్రమే కాదు, ఒక వైద్యునిగా, ఒక మానవతావాదిగా కూడా సమాజానికి తమ సేవలందించి, తమ కర్తవ్య నిర్వహణలో సఫలీకృతులైనారు శ్రీ అనంతాచార్య.

కారణజన్ములైన ఆ మహనీయమూర్తి జీవిత చరమాంకంలో శ్రీశిరిడీ సాయినాథుని సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులవటం విశేషం.

అత్రి మహామునిని పోలిన తపస్వి శ్రీ అనంతాచార్య సంపూర్ణ దత్తావతారులు శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారికి జన్మనిచ్చి తమ తపస్సు పండించుకొన్నా రనటం సమంజసం.

వీరి తపోశక్తి, యోగనిష్ఠ, అసమాన ప్రజ్ఞ మొదలైన మహత్తరమైన దైవీగుణ సంపన్నత మరుగున పడివున్న ఆయన జీవితం మాటున వెలుగుచూడక నిలచివున్నాయి. ఆ మహాత్ముని జీవితవిశేషాలను వెలికితీసి ప్రజలకందించే ప్రయత్నం జరుగుతున్నది.

అటువంటి అనంత దైవీగుణ సంపన్నునికి జోహార్లు! శ్రీ భరద్వాజ గురుదేవుల జనకులు శ్రీ అనంతాచార్యులకు అనంతకోటి ప్రణామాలు!!

# అధ్యాయం - ౨

# ఆదిదేవుని ఆవిర్భావం

అది ఆంధ్రదేశంలో గుంటూరు జిల్లాలోని బాపట్ల పట్టణం. 1938వ సంవత్సరం అక్టోబరు 30వ తేదీ కార్తీక శుద్ధసప్తమి ఉదయం 5-15నిమిషాలు.

భగవంతుడు శ్రీ దత్తాత్రేయుడు తన అవతారఘట్టానికి వలసిన రంగాన్ని సృష్టించుకొని భూమిపై అడుగుమోపే శుభ ఘడియలు ఆసన్నమైనాయి.

శ్రీ అనంతాచార్యులవారి కుటుంబమే ఒక స్వర్ణవేదికగా, తపస్విని, యోగమాత అయిన శ్రీమతి బుచ్చి వెంకట లక్ష్మిగారి పవిత్ర గర్భాన శ్రీ దత్తాత్రేయస్వామి ఆవిర్భవించి భూలోకాన్ని ఆనందమయమొనరించాడు. సాక్షాత్తు పరమాత్ముడు చిన్నారి శిశువుగా పుడమిపై సాక్షాత్కరించగా ప్రకృతిమాత పులకరించింది. జగమంతటా పండుగ వాతావరణం నెలకొన్నది. అంధకారం అంతరించి అంతటా వెలుగులు నిండే ఆ ఉషోదయంలో అజ్ఞానపు చీకట్లను పారద్రోలే జ్ఞాన భాస్కరుడు దత్తస్వామి అవతరించాడన్న ఆనందంలో వారింటి పరిసరాలలోని విరబూసిన పుష్పలతలపై, ఫలవృక్షాలపై నిలచిన చిలుకలు, కోయిలలు ఆలపిస్తున్న సుస్వర గీతాలు వీనులవిందు చేస్తుండగా అవనిపై అవతరించిన పరమాత్మను తిలకించేందుకు పరుగు పరుగున తూరుపు కొండను చేరిన దినకరుడు తన అనంతకోటి బంగారు కిరణాలతో మంగళ హారతులిచ్చి భక్తితో ఆ చిన్నారి దేముడికి ప్రణమిల్లాడు.

పరమాత్ముడు మానవుడుగా ఉదయించాడు.
పుణ్యప్రదమై వర్ధిల్లింది బాపట్ల పట్టణం.
ధన్యతనొందింది అనంతాచార్యుల వారి నివాస గృహం.
చరితార్థమై నిలచింది అనంతాచార్యుని వంశం.
సార్థకమై వెలుగొందింది అనంతాచార్య దంపతుల జీవనం.

★★★★★

బంగరు రంగు మేనిచ్ఛాయతో, సర్వాంగ సుందరంగా, ముగ్ధ మనోహరంగా వున్న ఆ శిశువును చూసిన వారంతా ఎంతోముచ్చటపడ్డారు.ఇకఆకన్నతల్లిఆనందానికిమేరలేదు. శ్రీ అనంతాచార్యులవారు బంధు మిత్రాదులనాహ్వానించి నామకరణ మహోత్సవం చేయ సంకల్పించారు. ఆ రోజుల్లో

'ఆయుర్వేద దర్శిని' అన్న గ్రంథం రచిస్తుండగా ఈ శిశువు జన్మించటం వలన ఆయుర్వేదానికి మూల పురుషులైన శ్రీ భరద్వాజ మహర్షి పేరు పెట్ట సంకల్పించి ఆ పిల్లవానికి 'భరద్వాజ' అని నామకరణం చేశారు శ్రీ అనంతాచార్య.

పుష్టిగా, బొద్దుగా, స్ఫురద్రూపంతో ముచ్చటగొలుపుతూ, తన ఆటపాటలతో మురిపిస్తూ, ముద్దుమాటలతో మైమరపిస్తూ చూపరులను ఎంతో ఆకర్షించే ఆ వరపుత్రుడు తల్లిదండ్రులకు, యిరుగు పొరుగు వారికి కనుల విందొనరించసాగాడు.

పరమేశ్వరుడు పసిబాలుడై యింట్లో సంచరిస్తుంటే యిల్లంతా ఆనందమయమే!

ఇంటా, బయటా అందరూ ఆ మురిపాల ముద్దు బాలుడి ముచ్చట్లతో పొద్దు పుచ్చుతున్నారు. ఆ ఆనందంలో రోజులు, నెలలు, సంవత్సరాలు నిమిషాల వలె గడచిపోయాయి. భరద్వాజ నాలుగేండ్ల ప్రాయపు వాడైనాడు.

విధి లీలలు విచిత్రమైనవి. కాలమెంతో కఠినమైనదన్న విషయం లోకవిదితమే. మనుష్యుల బ్రతుకులపై కష్టసుఖాలను నిర్దయతో శాసించే కాలానికేమి తెలుసు, మానవ హృదయాలలోని మమతానురాగాలు! అందుకే, ఒక సంతోషాన్ని అనుభవిస్తుండగానే నిర్దాక్షిణ్యంగా మరొక విషాదాన్ని విధించే కాలపురుషుడు, మానవ జీవితాలతో ఆటలాడుకొని ఆనందిస్తుంటాడనిపిస్తుంది. దైవలీలలు ఎవరికెరుక? శ్రీ అనంతాచార్యులవారి సతీమణి శ్రీమతి బుచ్చి వెంకట లక్ష్మిగారు దివంగతులైనారు!

ఎంతటి వారికైనా బాధలు తప్పవు కాబోలు! పరమాత్మునికి జన్మనిచ్చిన ఆ తండ్రికి భార్యా వియోగం! ముక్కు పచ్చలారని పసిపిల్లలకు మాతృవియోగం! శ్రీమతి బుచ్చి వెంకట లక్ష్మిగారు అంతకు కొన్ని మాసాల క్రితం ఒక పసిపాపకు జన్మనిచ్చారు. నెలల పసికందు, నాలుగేళ్ళయినా నిండని చిన్నారి భరద్వాజ మాతృ వియోగంతో తల్లడిల్లారు.

శ్రీమతి బుచ్చి వెంకట లక్ష్మిగారు అంతకు కొన్నేండ్లుగా అస్వస్థులుగా వున్నారు. హృద్రోగంతో బాధపడే ఆమెకు తరచుగా వ్యాధి తీవ్రతరమౌతుండేది. అయితే ఘనవైద్యుడు, యోగపురుషుడు అనంతాచార్యగారి భార్యను రోగం బాధించడ మేమిటి? ఆయన శోధించి సాధించిన ప్రపంచ విఖ్యాతిగాంచిన 'ఓజని' వంటి దివ్యౌషధాలు కానీ, అనంతాచార్య గారి తపశ్శక్తిగానీ ఆమె వ్యాధిని ఎందుకు నివారించలేకపోయాయి? - అనే ఎన్నో సందేహాలు మనవంటి వారికి కలగటం సర్వ సాధారణం. అయితే అవన్నీ మనకు శేష ప్రశ్నలే! పరిమిత శారీరక, మానసిక శక్తి సామర్థ్యాలు గల మనం జగన్నాటక సూత్రధారి అయిన ఆ పరమాత్ముని చర్యలను విశ్లేషించ బూనటం అవివేకమే!

అప్పుడప్పుడూ శ్రీమతి బుచ్చి వెంకటలక్ష్మిగారికి వ్యాధి తీవ్రతరమై కదలలేక పోయేవారు. అలాంటి సమయంలో ఒక గదిలో మంచంపై పడుకొని 1-2 నెలలు ఆమె తీవ్రమైన శరీర బాధననుభవిస్తుండేవారు. ఆమెను ఏ మాత్రం ఆటంకపరచకుండా విశ్రాంతి నివ్వాలనే ఉద్దేశంతో ఎవరూ గదిలోకి రాకుండా గది తలుపులు మూసివేసేవారు. పసిబాలుడైన భరద్వాజకి తల్లితో వున్న అనుబంధం చాలా ఎక్కువ. ఆమెను విడచి వుండలేని ఆ పిల్లవాడు, వ్యాధితో బాధపడే సమయంలో తల్లి వద్దకు వచ్చి ఆమెకు బాధ కలిగిస్తాడనే ఉద్దేశంతో, గది తలుపులు మూసి ఆమెకు స్వస్థత చేకూరిన తర్వాత తలుపులు తీసేవారు. ఆమెకు మందులు, ఆహారం యిచ్చేందుకు కావలసిన సపర్యలు చేసేందుకు శ్రీ అనంతాచార్య, లక్ష్మడు అనే యింటిలోని సేవకుడు మాత్రం గదిలోకి వెళ్ళి వస్తుండేవారు. పిల్లలంతా దీన వదనాలతో దిగులుగా కాలం గడుపుతుండేవారు. ముఖ్యంగా అందరికంటే చిన్నవాడైన భరద్వాజ తల్లి కనిపించక పోవటంతో ఎంతో దిగులుపడి ఎప్పుడు తలుపు తీస్తారా, ఎప్పుడు అమ్మను చూస్తానా అని ఎంతగానో ఎదురు చూసేవాడు. కొద్ది రోజులకు ఆమెకు వ్యాధి తీవ్రత తగ్గగానే గది తలుపు తీసినప్పుడు చిన్నారి భరద్వాజ ఒక్క పరుగున వెళ్ళి అమ్మ ఒడిలో వ్రాలేవాడు. ఆమె కూడా ఎంతో ఆత్రుతతో బిడ్డను దగ్గరకు తీసుకొని లాలించేవారు.

ఆమె వ్యాధితో కొంతకాలం బాధపడ్డారు. ఒకసారి ఎప్పటిలాగానే ఆమెకు వ్యాధి తీవ్రమైంది. ఎప్పటిలాగానే ఆమె వున్న గది తలుపులు పిల్లలెవ్వరూ వెళ్ళకుండా మూసివేశారు. కొన్ని రోజులు గడచిపోయాయి. ఎంతోకాలంగా తీవ్ర బాధననుభవిస్తున్న ఆమెను ఆ బాధనుండి విముక్తి కలిగించాలనుకున్నాడేమో ఆ దేముడు? మరి యిక ఎప్పటికీ ఆమె ఆ బాధననుభవించ వలసి రాకుండా ఆమెకు భవబంధాలనుండి విముక్తి కలిగించి శాశ్వతంగా తన చెంత చేర్చుకున్నాడు.

అయితే ఆ తల్లి తన బాధలనుండి విముక్తి పొందింది గానీ, ఆమె కుటుంబం తీవ్ర బాధలపాలు అయింది. ముఖ్యంగా చిన్నవారైన పిల్లల పరిస్థితి ఎంతో దయనీయంగా పరిణమించింది. గుండెలు మోయలేని యీ విషాదాన్ని ముక్కుపచ్చ లారని పిల్లలు ఎలా భరించగలరు?

శ్రీమతి బుచ్చి వెంకట లక్ష్మిగారి అంతిమ సమయంలో ఆమె వ్యాధి తీవ్రతరమైన పరిస్థితిలో హృద్రోగి అయిన ఆమె మంచంపై కూర్చుని వున్నంతకాలం జీవిస్తుందనీ, పడుకుంటే మరణిస్తుందనీ వైద్యులంతా చెప్పటంతో ఆమె 28 రోజుల వరకు అలాగే మంచంపై కూర్చుని చివరకు కూర్చొనగలిగే శక్తి క్షీణించటంతో యింక తాను కూర్చొనలేనని, పడుకొంటాననీ చెప్పారు. ఆ సమయంలో చివరిసారిగా చిన్నారి భరద్వాజని తల్లి వద్దకు తీసుకొచ్చి తల్లికి చూపించారు. ఆమె ఆ బిడ్డను ఒడిలోకి తీసుకొని తనివితీరా ముద్దాడిన తర్వాత బిడ్డను మరల ఆ గదినుండి బయటకు తీసుకొనివెళ్ళారు. ఆ తర్వాత ఆమె మంచంపై పడుకొని ఈ లోకం నుండి శాశ్వత విశ్రాంతి పొందారు. భరద్వాజకి తల్లితో అనుబంధం అపారం. అందువల్ల ఆమె మృతదేహం చూస్తే ఆ పసివాడు ఏ విధంగా మనోవ్యధకు గురి అవుతాడోననే భయంతో ఆమె మరణించిన తర్వాత భరద్వాజకి ఆమె దేహాన్ని చూపించకుండానే తదుపరి కార్యక్రమాలన్నీ జరిగిపోయాయి. ఆ తర్వాత మూసివున్న ఆ గది తలుపులు ఒకనాడు హఠాత్తుగా తెరుచుకున్నాయి. ఏమీ తెలియని భరద్వాజ అమ్మకోసం ఆతృతగా గదిలోకి వెళ్ళాడు. అయితే ప్రతిసారీ మంచంపై కూర్చుని కనిపించే అమ్మ ఏదీ? ఎక్కడా కన్పించదే? ఏమైంది? చిన్నారి భరద్వాజ శూన్యంగా వున్న గదిలో ఎంతోసేపు దిగాలుగా నిలుచుండి పోయాడు. అమ్మలేని బాధ క్రమంగా హృదయాంతరాళాలలోకి చొచ్చుకుని గుండెల్లో గూడు కట్టుకుంది. తెలియని దిగులుని వ్యక్తం చేయటం చేతకాని వయస్సు. తన బాధ ఎవరికి అర్థమౌతుంది? ఎవరు తీరుస్తారు?

జీవిత పరమార్థం వైపు నడిపించే మొట్టమొదటి పాఠం మొగ్గదశలోనే భరద్వాజకి బోధించబడింది. అత్యంత ప్రియమైన వస్తువును పోగొట్టుకొనటంలోని బాధ, తానిక దానిని తిరిగి పొందలేని అశక్తత ఎంతగానో బాధించగా, తన ఆనందం, ఆలంబనం, ఆధారం, తన సర్వస్వం అయిన అమ్మే తనకిక లేదా? – అన్న భావాలన్నీ భాషకందని మూగవేదనగా, రోదనగా ఆ చిన్ని హృదయంలో రూపుదాల్చుకున్నాయి. నిరాశ నిస్పృహలు ఆవరించగా ఆ పసివాడి మనస్సులోని బాధ స్తబ్దతగా, నిరామయతగా మారిపోయింది. అప్పటినుండి సంవత్సర కాలంపాటు ఆ పసివాడు ఎవరితోనూ పలుకకుండా, ఏడవకుండా, ఏ మాత్రం అల్లరి కూడా చేయకుండా దిగులుతో నిశ్శబ్దంగా రోజులు గడిపేవాడు. సంవత్సరకాలం గడచిన తర్వాత అతడి వైఖరి మరోవిధంగా మారిపోయింది. అతడు ప్రతి విషయానికీ చికాకుపడుతూ, విపరీతంగా అల్లరి చేస్తూ, చీటికీ మాటికీ ఏడుస్తూ "నాకు అమ్మ కావాలి" అని అడుగుతూ అన్నింటికీ పేచీలు పెడుతూ వుండేవాడు. కొన్నాళ్ళకు ఎంత ఏడ్చినా అమ్మ రాదన్న నిస్పృహ గుండెలోతుల్లో శాశ్వతంగా నిలచిపోయింది. ఆ సత్యమే 'మృత్యువు' అని పిలువబడుతుందని కాలాంతరంలో పిచ్చుక మరణించిన సందర్భంలో ఆ చిన్నారి బాలుడికి కొంత అవగతమైంది.

శ్రీమతి బుచ్చివెంకటలక్ష్మిగారు దివంగతులైన అనంతరం బంధువులంతా పిల్లలను తాము పెంచుతామని, నడి వయస్కుడైన అనంతాచార్య మరల వివాహం చేసుకొనటం యుక్తమనీ సలహా యిచ్చారు. కానీ అనంతాచార్యుల వారు బంధువుల సలహాలను పాటించలేదు. తమ బిడ్డలను తామే పెంచుకొనగలమని చెప్పి ఒంటరిగానే బిడ్డల సంరక్షణ బాధ్యతను వహించారు. ఆయన చాలాకాలం వరకు మరల వివాహం కూడా చేసుకొనలేదు. శ్రీ అనంతాచార్యను ఒప్పించి నెలల పసికందుగా వున్న వారి పాపను బంధువులు తమతో తీసుకెళ్ళారు. కొద్ది నెలలకు బంధువుల యింట్లో పెరుగుతున్న ఆ పాప ఉయ్యాల నుండి క్రిందపడి మరణించింది.

అనంతాచార్యులకు కర్తవ్యం ముందు నిలచింది. తమ వృత్తి ధర్మం నిర్వర్తిస్తూ నలుగురు పిల్లలనూ సంరక్షించుకొనసాగారు. తల్లి ప్రేమను కోల్పోయిన పసివాడు భరద్వాజను తండ్రి ఎంతో సానుభూతితో ఆదరిస్తుండేవారు. ఆ గారాబు బిడ్డ యిల్లంతా తిరుగుతూ, ఆడుతూ, పాడుతూ, అల్లరి చేస్తూ అందరి ప్రేమను చూరగొంటూ పెరిగి పెద్దవాడౌతున్నాడు.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

జన్మదినోత్సవాలలో ఒక రోజున 108 రకములైన వంటకాలతో అన్నపూర్ణాదేవికి నివేదన సమర్పించారు. ఆనాటి రాత్రి బాగా వర్షం పడింది. బయట ఆవరణలో భక్తులతో కలిసి కూర్చొని సంకీర్తన చేస్తున్న అమ్మ సంకీర్తన ఆపకుండా కూర్చున్న చోటు నుండి లేవకుండా ఆ వర్షంలోనే తడుస్తూ సంకీర్తన కొనసాగించారు. కొందరు భక్తులు ఆశ్రమం వరండాలో కూర్చుని భజన చేస్తున్నారు. అమ్మ దోసిలి నిండా వర్షపునీరు పట్టి వరండాలో కూర్చున్న వారిపై చల్లుతూ వాళ్లను పూర్తిగా నీటితో తడిపివేశారు. అప్పుడు వాళ్ళందరూ కూడా బయటకు వచ్చి అమ్మ వద్ద కూర్చుని వానలో తడుస్తూ సంకీర్తనలో పాల్గొన్నారు. భజన చేస్తూ ఆ వాన నీటిలో నేలపై బురదలో దొర్లసాగారు. చాలాసేపు సంకీర్తన కొనసాగింది. ఆ తర్వాత హారతి సమయం అవ్వటంతో అందరూ లోపలికి వచ్చి స్నానాలు చేసి హారతిలో పాల్గొన్నారు. ఆ రోజు అమ్మయే స్వయంగా అన్నపూర్ణాదేవికి హారతి యిచ్చారు.

శ్రీ ఆనందమయి మాత క్రొత్తగా ఆశ్రమ మందిరాలలో ప్రతిష్ఠించిన దేవతలను యెలా ఆరాధించాలో వివరించి చెప్పారు. గృహస్థ భక్తులు, మహిళలు, బ్రహ్మచారులు – యిలా యెవరెవరు యే యే మందిరాలలో పూజలు చేయాలో చెప్పి పూజా విధానాలను కూడా తెలియజేశారు. అందరికీ ఆదేశాలిస్తూ ప్రతి ఒక్క అంశం స్వయంగా పర్యవేక్షిస్తూ కార్యక్రమాలు జరిపించారు. ఆశ్చర్యకరమైన విషయం యేమిటంటే యెన్ని చేసినప్పటికీ అమ్మ యే విషయాలకు అంటనట్లుగా యీ కార్యక్రమాలతో, అసలు యీ లోకంతోనే సంబంధం లేనట్లుగా కనిపిస్తుండేవారు. అమ్మ యొక్క యీ వైఖరి భక్తులకు యెంతో ఆశ్చర్యం కలిగించేది.

ఈ సంవత్సరం జన్మదినోత్సవ వేడుకలలో పూజలన్నీ శ్రీ అన్నపూర్ణాదేవికే చేయటం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులందరూ దేవీ దేవతలకు యెన్నో కానుకలను సమర్పించారు. గంధపు డబ్బాలు, కుంకుమ భరిణెలు చీరెలు యింకా యితరములైన అనేక రకములైన కానుకలను భక్తులు సమర్పించారు. వాటన్నింటిని పెద్ద పెద్ద గంపలలో నింపి ఉత్సవంలో పాల్గొన్న స్త్రీలందరికీ పంచారు. అలా ఎంతో వైభవోపేతంగా శ్రీ ఆనందమయి మాత జన్మదిన వేడుకలు జరిగాయి.

జన్మదినోత్సవ వేడుకలు ముగిసిన తర్వాత అమ్మ భక్తులకు సాధనా విధానాలను తెలియజేప్పి వాటిని అనుసరించి సాధన కొనసాగించవలసినదిగా నిర్దేశించారు. ఆ విధానాలన్నీ ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా వారి వారి సంస్కారాలకు, స్థాయిలకు తగినట్లుగా వుండటం జరిగింది. శశాంక బాబుకు అమ్మ ఏకాంతంలో ఎన్నో సాధనా రహస్యాలను తెలియజేశారు. ఆయనను కౌపీనం మాత్రమే ధరించమని ఆదేశించారు. అంతకు ముందు కొంతకాలం నుండి అమ్మ ఆదేశం ప్రకారం ఆయన గృహస్థుల యిండ్లకు వెళ్లటం మానివేశారు. చెప్పులు ధరించటం మానివేశారు. చొక్కా కూడా అప్పుడప్పుడు మాత్రమే ధరించేవారు. అమ్మ మనోరమ అనే భక్తురాలిని కూడా రమణాశ్రమంలో వుంటూ సాధన కొనసాగించవలసిందిగా చెప్పడంతో ఆమె భర్త అనుమతి తీసుకొని రమణాశ్రమంలో వుండసాగింది.

ఒకరోజు అమ్మ వినయ్ దాదా ఇంటికి బయలుదేరారు. అమ్మ వెంట శ్రీ భోలానాథ్ గారు, గురుప్రియ, మనోరమ, జ్యోతిష్ దాదా కూడా బయలుదేరారు. వినయ్ దాదా తన ఇంట్లో అమ్మను పూజించుకున్నాడు. తిరిగి వచ్చేటప్పుడు వినయ్ దాదా తల్లి బియ్యము, పెసరపప్పు, కూరగాయలు, కొంత దక్షిణ అమ్మకు సమర్పించేందుకై తీసుకురాగా గురుప్రియ తన చీరకొంగు చాపి వాటన్నింటిని కొంగులో వేయించుకుంది. నవ్వుతూ అమ్మతో "అమ్మా ఈరోజు మనం కూడా భిక్షాటన చేశాము కదమ్మా" అన్నది గురుప్రియ. అంతకు కొద్ది రోజుల ముందు వారంలో ఒకరోజు భిక్షాటన ద్వారా ఆహార పదార్థాలను సేకరించవలసినదిగా కమలాకాంత్ ను అతుల్ ను అమ్మ ఆదేశించారు. ఆ పదార్థాలతోనే వంటచేసి యజ్ఞాగ్నికి ఆహుతి సమర్పించి వారు కూడా దానినే ప్రసాదం స్వీకరించాలని శ్రీ ఆనందమయి మాత అతుల్, కమలాకాంత్ లకు చెప్పారు. వినయ్ దాదా ఇంటి నుండి అమ్మ బయలుదేరి కులదా దాదా, ప్రతాప్ బాబు, రాయి బహదూర్, భూదేవ బాబు – యిలా కొంతమంది భక్తుల యిండ్లకు కూడా వెళ్లి భిక్ష సేకరించారు. అలా భిక్ష ద్వారా వచ్చిన పదార్థాలు చాలా ఎక్కువగా వుండటంతో వేరొక కారును కూడా తెప్పించి ఆ కారులో ఆ పదార్థాలన్నింటిని ఆశ్రమానికి చేర్చారు. ఆరోజు భిక్ష సమర్పించిన భక్తులందరినీ కుటుంబ సమేతంగా వచ్చి ఆశ్రమంలోనే భోజనాలు చేయవలసిందిగా అమ్మ చెప్పారు. ప్రతిరోజు భిక్ష ద్వారా వచ్చిన పదార్థాలతోనే వంటలు చేసి అమ్మకు, దేవతలకు నివేదించిన తర్వాత ఆశ్రమ వాసులంతా ప్రసాదం స్వీకరించాలని అమ్మ చెప్పారు. ఆశ్రమం లోని యజ్ఞాగ్నితో పొయ్యిలు వెలిగించి, వంటలు చేసి, దేవతా నివేదనలు సమర్పించిన తర్వాత భక్తులంతా భోజన ప్రసాదాలను స్వీకరించారు.

ఆ తర్వాత ఒకరోజు మనోరమ, మరొక రోజు బేబీ అక్క భిక్ష ద్వారా వచ్చిన పదార్థాలతో 108 రకాల వంటకాలు వండి అమ్మకు నివేదించారు. అమ్మ ఆ పదార్థాలనన్నింటిని ఒక పాత్రలో వేసి కలిపి విస్తరాకులలో భోజన పళ్ళాలలో కాకుండా భక్తులకు వారి చేతులలోనే అమ్మ స్వయంగా ప్రసాదం పెట్టడంతో భక్తుల ఆనందానికి అవధులు లేవు. తల్లి చేతి గోరుముద్దలు తినే పసిబిడ్డల వలె వారంతా ఎంతో ఆనందించారు.

భోజనాల అనంతరం అమ్మ తన కుటీరంలోకి వెళ్లి పడుకున్నారు. సాయం సమయంలో గురుప్రియ వచ్చి అమ్మ వద్ద కూర్చుని, "అమ్మా! కొందరు స్త్రీలు మిమ్మల్ని దర్శించాలని వచ్చారమ్మా" అన్నది. అమ్మ ఒక అలౌకిక స్థితిలో గురుప్రియను చూస్తూ, "దర్శనానికి వచ్చారా? ఎవరు ఎవరికి ఎవరు ఎవరి దర్శనానికి వచ్చారు? స్వయంగా వాళ్ళు తమను తాము దర్శించుకొనటానికి వచ్చారు. అంతే!" అన్నారు. సంధ్యా సమయం తర్వాత అమ్మ లేచి తన కుటీరం ముందున్న వరండాలోకి వచ్చి కూర్చున్నారు. భక్తులతో అమ్మ చాలాసేపు సంభాషించారు. కొంతసేపటి తరువాత భక్తులు కొద్దిమంది తప్ప మిగిలిన వారంతా అమ్మ వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయారు. ఉన్నట్లుండి అమ్మ లేచి నిలబడి నెమ్మదిగా అస్పష్టంగా, "ఇప్పుడు నేను వెళ్ళిపోతున్నాను" అన్నారు. అక్కడే ఉన్న వీరేంద్ర దాదా అమ్మ మాటలు విని కంగారుగా, "అమ్మా! ఏమంటున్నారు? ఇప్పుడు మీరేమీ మాట్లాడకండి. మీరు వెళ్లి పడుకోండి" అన్నాడు. అమ్మ అతని మాటలు వినిపించుకోకుండా గిరీంద్ర దాదాతో శ్రీ భోలానాథ్ గారిని, జ్యోతిష్ దాదా ని పిలుచుకురమ్మని చెప్పారు. వారు రాగానే వారిని తనతో బయలుదేరవలసిందిగా చెప్పారు అమ్మ.

ఈ గ్రంథం ప్రారంభంలోనే గురుప్రియా దేవి అనే భక్తురాలి గురించి ప్రస్తావించుకున్న విషయం చదువులకు గుర్తుండి వుంటుంది. ఆమె మొదటగా ఆమె తండ్రి శశాంక బాబు గారితో కలిసి అమ్మను దర్శించిన వుదంతం గురించి తెలియజేయడం జరిగింది. గురుప్రియ అమ్మతో ప్రథమ పరిచయంతోనే అమ్మ పట్ల ఆకర్షితురాలు అయ్యింది. అతి స్వల్పకాలంలోనే ఆమెకు అమ్మతో ప్రగాఢమైన అనుబంధం ఏర్పడింది. క్షణం కూడా అమ్మను వీడక నీడలాగా అమ్మను వెన్నంటి వుండే గురుప్రియ అమ్మకు ప్రీతిపాత్రురాలుగా మారిపోయింది. అమ్మని విడిచి వుండటం అనేది ఆమె ఊహకు కూడా అందని విషయం. ఎక్కడికి వెళ్లినా అమ్మ గురుప్రియ వెంట లేకుండా వెళ్లడం అనేది సాధారణంగా యెంతో అరుదుగా మాత్రమే జరిగేది. 1932వ సంవత్సరం జరిగిన అమ్మ జన్మదినోత్సవాల తర్వాత వున్నట్లుండి అమ్మ యీ విధంగా 'నేనిప్పుడే బయలుదేరున్నాను' అనడం, 'జ్యోతిష్ దాదాను శ్రీ భోలానాథ్ గారిని మాత్రమే తన వెంట రమ్మనడం' గమనించిన గురుప్రియ అమ్మ తన వెంట ఆమెను తీసుకు వెళ్ళటం లేదన్న విషయమై అర్థమై, నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. ఇంతలో అమ్మ గురుప్రియను చేయి పట్టుకుని కుటీరం లోపలికి తీసుకువెళ్లారు. గురు ప్రియను

తన పక్కన కూర్చోబెట్టుకొని ఆమె చేతులు పట్టుకొని, "గురుప్రియా! ధైర్యం అనేది సాధనలో ప్రధానమైన అంశం. సాధకులు యెప్పుడూ ధైర్యాన్ని కోల్పోకూడదు" అన్న ఆ మాటలకు చలించి పోయింది గురుప్రియ. అమ్మ "కంగారు పడకు. నేను ఎన్నిసార్లు బయటికి వెళ్లలేదు. మీరంతా యిలా కంగారు పడుతుండటం వలన నేను తిరిగి రావటం జరుగుతున్నది. నన్ను నా మార్గాన్ని వెళ్ళనివ్వండి. మీరు యీ విధంగా నా మార్గానికి ఆటంకం కలిగిస్తే నేను జీవించి వుండను" అన్నారు. గురుప్రియ అమ్మ ఒడిలో తలపెట్టుకుని యేడవ సాగింది. అమ్మ ఆమెను ఓదారుస్తూ, "చూడు, నీ బాధ నాకు తెలియదా? మొట్టమొదటగా నువ్వు నా దగ్గరకు వచ్చిన రోజు నేను నా గదిలో నీతో యేమన్నానో గుర్తుందా? ఇన్నాళ్లు యెక్కడున్నావు నువ్వు? అన్నాను కదా. ఆ మాటకు అర్థం తెలియదా నీకు? అంతేకాదు, మనం యెక్కడికి వెళ్లినా ప్రతి చోటా అందరూ మనిద్దరం అక్కాచెల్లెళ్ళం అనేవారు కదా. మన ముఖ కవళికలు ఒకే విధంగా వుండటం వలన అక్కాచెల్లెళ్లం కాము అని చెప్పినా యెవరూ నమ్మటం లేదు. దీనిని బట్టి నీకు అర్థం కావడం లేదా నీతో నా అనుబంధం" అంటూ ఆగిపోయారు అమ్మ. గురుప్రియ యేడుస్తూనే వుంది. చాలాసేపు గురుప్రియను ఓదార్చి గురుప్రియతో బయటకు వచ్చారు అమ్మ.

అమ్మ భక్తులతో మాట్లాడుతూ "శశాంక బాబుని పిలవండి" అన్నారు. ఆయన రాగానే ఆయనతో, "నేను యీ రోజు యిక్కడి నుండి వెళ్ళిపోతున్నాను" అన్నారు. "ఎక్కడికి వెళ్తున్నారు? ఎప్పుడు తిరిగి వస్తారు?" అని అడిగాడు శశాంక బాబు. "ఏమో తెలియదు" అన్నారు అమ్మ. ప్రతిసారి భక్తులతో "మీరు పిలిచినప్పుడు వస్తాను" అంటారు. కానీ యీసారి అమ్మ అలా అనలేదు. అందరూ మౌనంగా నిలబడి వున్నారు. గురుప్రియ అమ్మ పాదాల వద్ద కూర్చొని యేడుస్తున్నది. హఠాత్తుగా అమ్మ తన మెడలోని బంగారు యజ్ఞోపవీతాన్ని తీసి గురుప్రియ మెడలో వేసి, "దీనిని నీ మెడలో వుంచుకో" అన్నారు. ఆ యజ్ఞోపవీతాన్ని గురించి కొన్ని అనుష్ఠాన విధానాలను గురుప్రియకు అమ్మ వివరించారు. మరికొందరితో వారి వారి సాధనలకు తగిన సూచనలను తెలియజేశారు. అందరికీ అన్నీ చెప్పి అమ్మ ప్రయాణానికి సిద్ధమైనారు. ఏ ఒక్కరిని కూడా కనీసం రైల్వే స్టేషన్ వరకు కూడా వెంట రావటానికి అమ్మ అనుమతించలేదు. స్టేషన్ వరకు అమ్మను తీసుకువెళ్లేందుకు భక్తులు తీసుకువచ్చిన కారును కూడా అమ్మ వెనక్కి పంపేశారు. కేవలం శ్రీ భోలానాథ్ గారు, జ్యోతిష్ దాదా – వీరిద్దరిని మాత్రమే వెంటబెట్టుకొని అమ్మ కాలినడకన ఢాకా నుండి బయలుదేరారు. అమ్మ వెళ్లిపోయిన తర్వాత గురుప్రియ పరిస్థితి వర్ణనాతీతం. తన సర్వస్వాన్ని కోల్పోయినట్లుగా రాత్రంతా నిద్రాహారాలు లేకుండా యేడుస్తూ వుండిపోయిందామె.

ఆనాటి నుండి చాలాకాలం వరకు అమ్మ గురించిన యే కబురు యెవరికి తెలియలేదు. కొన్ని రోజుల తర్వాత ఉపేంద్ర బాబు అనే భక్తుడు అమ్మ దర్శనార్థం ఢాకా వచ్చాడు. అమ్మ ఢాకా విడిచి వెళ్లిపోయారని విని అమ్మజాడ తెలుసుకునేందుకు బయలుదేరాడు. అలా తిరుగుతూ తిరుగుతూ హిమాలయ ప్రాంతాలలోని ప్రదేశాలన్నింటిలో అమ్మకోసం వాకబు చేశాడు. చివరకు డెహ్రాడూన్ కు ఐదు ఆరు మైళ్ళ దూరంలో వున్న రాయపూర్ అనే ప్రాంతంలో అమ్మ వున్నారని విని అక్కడికి వెళ్లి అమ్మను దర్శించుకున్న ఉపేంద్ర బాబు ఆనందానికి అవధులు లేవు. ఉపేంద్ర బాబు రాయపూర్ లో అమ్మను దర్శించిన సమయంలో ఒక శివాలయ ప్రాంగణంలో అమ్మ శ్రీ భోలానాథ్ గారు, జ్యోతిష్ దాదా కూర్చొని వున్నారు. అమ్మకు నమస్కరించుకుని ఉపేంద్ర బాబు అమ్మ పాదాల చెంత కూర్చున్నాడు. అమ్మ యేమి మాట్లాడలేదు. కొంతసేపటి తర్వాత ఉపేంద్ర బాబు అమ్మతో, 'అమ్మా! నాకు యిక్కడ రాయపూర్ లో మీ సన్నిధిలో కొన్నాళ్లు గడపాలని వుందమ్మా. దయతో అనుమతించండమ్మా" అని వేడుకున్నాడు అమ్మ అందుకు సమ్మతించలేదు. మీరంతా స్థిరంగా ఒక చోటు వుంటూ, మీకు విధించబడిన సాధనలను నిష్ఠతో చేయవలసిన అవసరం యెంతైనా వున్నది. లక్ష్యసాధనపై దృష్టి కేంద్రీకరించడం అన్నింటికంటే ముఖ్యం" అన్నారు. అమ్మ అక్కడ వుండేందుకు అనుమతించకపోవడంతో ఉపేంద్ర బాబు తిరిగి తన ఊరికి వెళ్ళిపోయాడు

కొన్ని రోజుల తర్వాత జ్యోతిష్ దాదాకు సెలవులు అయిపోయినందువలన ఆయన కమలాకాంత్ ను రాయపూర్ కు రప్పించి, ఢాకా బయలుదేరాడు. అమ్మ జ్యోతిష్ దాదా ను దారిలో కాశీలో ఆగి గంగా స్నానము విశ్వేశ్వర దర్శనము చేసుకొని ఢాకా వెళ్ళవలసినదిగా చెప్పారు. కాశీలో జ్యోతిష్ దాదాకు అమ్మ ఒక అపూర్వ దివ్యానుభవాన్ని ప్రసాదించారు. ఆ సంఘటన యెలా జరిగిందంటే, జ్యోతిష్

దాదా కాశీలో దిగి మధ్యాహ్న సమయంలో గంగానది వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో స్నాన ఘట్టం వద్ద యెవరూ లేరు. జ్యోతిష్ దాదా నదిలో దిగాలని ఘాట్ మెట్టుపై కాలు పెట్టగానే కాలుజారి నదిలో పడిపోయాడు. నీటిలో మునిగి ప్రవాహంలో వేగంగా కొట్టుకుపోతున్న జ్యోతిష్ దాదా కు అకస్మాత్తుగా ఘాట్ మెట్లపై ఒక వ్యక్తి కనిపించాడు. అతడు వెంటనే నదిలో దూకి జ్యోతిష్ దాదా చేయి పట్టుకుని ఒడ్డుకు చేర్చాడు. "నదిలో దిగేటప్పుడు యెంత జాగ్రత్తగా వుండాలో తెలియదా?" అంటూ జ్యోతిష్ దాదా ను మందలించి వెళ్లిపోయాడు ఆ వ్యక్తి. అమ్మ దయతో జ్యోతిష్ దాదా ఆపదనుండి బయటపడి విశ్వేశ్వరుని విశాలాక్షి, అన్నపూర్ణ అమ్మవార్లను దర్శించి ఢాకా వెళ్ళిపోయాడు.

అదేరోజు అదే సమయంలో అమ్మ శివాలయం వెనక ఒంటరిగా కూర్చుని వున్నారు. కొంచెం సేపటి తర్వాత కమలాకాంత్ అమ్మ వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో అమ్మ పరిస్థితి చూసి అతడు నిర్ఘాంతపోయాడు. అమ్మ బట్టలన్నీ నీటిలో పూర్తిగా తడిసిపోయి వున్నాయి. ఎంతగా అంటే అప్పుడే నదిలో స్నానం చేసి పైకి వచ్చినట్లుగా బట్టల నుండి నీళ్లు కారుతూ నేలంతా తడిసిపోయివుంది. అమ్మ ఆ సమయంలో కనులు మూసుకొని ఒక అలౌకక స్థితిలో వున్నారు. మామూలు స్థితికి వచ్చిన తర్వాత కూడా అమ్మ యీ విషయం గురించి యేమీ చెప్పలేదు. కమలాకాంత్, శ్రీ భోలానాథ్ గారు ప్రశ్నించినప్పటికీ అమ్మ జవాబు యివ్వక మౌనం వహించారు.

జ్యోతిష్ దాదా రాయపూర్ నుండి రమణాశ్రమానికి తిరిగి రాగానే అక్కడి భక్తులంతా అమ్మ గురించిన వివరాలన్నీ తెలుసుకొనటానికి యెంతో ఆత్రుతతో జ్యోతిష్ పై ప్రశ్నల వర్షం కురిపించారు. అమ్మ యిక్కడి నుండి మొట్టమొదటిగా యెక్కడికి వెళ్లారు? ప్రస్తుతం యెక్కడ వుంటున్నారు? అక్కడ యెలా వున్నారు? ఏమి చేస్తున్నారు? వాళ్ళందరికీ ఆహారము, నివాసము, మిగిలిన సదుపాయాలు యెలా వున్నాయి? ఇలా ఆశ్రమవాసులు అడిగిన ప్రశ్నలన్నింటిని జ్యోతిష్ దాదా ఎంతో వివరంగా అన్ని విషయాలు పూసగుచ్చినట్లుగా తెలియజేశాడు. అతడు చెప్పిన విషయాల సారాంశం యిలా వున్నది—

అమ్మ జ్యోతిష్ దాదా, శ్రీ భోలానాథ్ గారితో కలిసి బయలుదేరి మొదటగా డెహ్రాడూన్ వెళ్లారు. కొన్నాళ్లు డెహ్రాడూన్ పరిసర ప్రాంతాలలో పర్యటించి రెండు మూడు వారాల తర్వాత రాయపూర్ కు వచ్చారు. కొండల మధ్య ప్రదేశంలో వున్న అతి చిన్న కుగ్రామం రాయపూర్. ఆ గ్రామానికి దూరంగా నిర్మానుష్య ప్రదేశంలో ఒక ప్రాచీన శివాలయం వుంది. ఆ శివాలయ ప్రాంగణంలో వున్న ఒక చిన్న గదిలో అమ్మ బృందం బస చేశారు. ఆ ప్రాంతంలో అసలు జనసంచారమే వుండదు. ఉదయాన పూజారి వచ్చి ఆలయాన్ని శుభ్రపరిచి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించి వెంటనే వెళ్ళిపోతాడు. మాట్లాడటానికి ఒక్క మనిషి కూడా కనిపించడు. పాములు, విష జంతువులు యథేచ్ఛగా సంచరిస్తూ వుంటాయి. ఆహార పదార్థాలు కూడా సరిపడినంతగా లభించవు. దొరికినంతలో సరిపెట్టుకుంటూ ఒకొక్కసారి కేవలం ఒకటి రెండు రొట్టెలు తిని వుండటం; కొన్ని రోజులు కేవలం వుడికించిన కూరగాయలు తిని గడపటం జరుగుతుంటుంది. రాయపూర్ లో వున్నన్నాళ్లు అమ్మ ఒక్కసారి కూడా తల దువ్వుకోనటం జరగలేదు. కనీసం జుట్టును ముడి కూడా వేసుకొనకుండా వదిలేయడంతో కొన్నాళ్లకు జుట్టంతా జడలు కట్టింది. పొడవుగా వేలాడుతున్న జడలన్నీ మరికొన్నాళ్ళకు ఒకదానితో ఒకటి పెనవేసుకుపోవడంతో కొంత జుట్టును కత్తిరించవలసిన పరిస్థితి యేర్పడింది.

అమ్మ రమణాశ్రమం నుండి కట్టుబట్టలతో బయలుదేరారు. ఆ ఒక్క చీరతోనే రోజులు గడుపుతున్నారు గాని ఆ చీరను మార్చి మరొకటి కట్టుకొనటం అనేది జరగలేదు. ఆ ప్రాంతమంతా విపరీతమైన చలి ప్రదేశము కావడంతో సాయంత్రం నాలుగు గంటలకే అక్కడి ప్రజలు పూర్తిగా ఒంటి నిండుగా కంబళ్ళు కప్పుకొంటారు. అయితే అమ్మ యే కంబళ్ళు, స్వెటర్లు వాడనే వాడటం లేదు. గది బయట పరండాలో కూర్చొనటం, లేకపోతే బయట తిరుగుతూవుండటం – యిది అమ్మ దినచర్య. జ్యోతిష్ దాదా, శ్రీ భోలానాథ్ గారు శివాలయంలో కూర్చుని అనుష్ఠానాలు, సాధనలు చేసుకుంటూ రోజంతా గడిపి, రాత్రి ఆలయంలోనే నిద్రిస్తుంటారు. అమ్మ రాయపూర్ లో వున్నారన్న విషయం క్రమక్రమంగా భక్తులందరికీ తెలియడంతో కొందరు రాయపూర్ వచ్చారు. కానీ అమ్మ యే ఒక్కరినీ రాయపూర్ లో వుండేందుకు అనుమతించక వెనక్కి పంపివేశారు.

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి కె. రమ, విద్యానగర్

మేము 15 సంవత్సరముల క్రితం విద్యానగరు వచ్చాము. అంతకు ముందు బాలిరెడ్డి పాలెం అనే ఊర్లో వుండే వాళ్ళం. సాయినాథుని దయవల్లనే మేము విద్యానగరు రావడం జరిగింది. బాబా మందిరం దగ్గరే మా ఇల్లు. రోజూ రెండుపూటలా బాబా మందిరానికి వెళ్లడం నా నిత్యకృత్యం. పూజ్యశ్రీ మాస్టరుగారి తపోవనం కూడా దర్శించుకుంటాను. శ్రీసాయినాథులవారు చాలాసార్లు స్వప్నదర్శనాలు ప్రసాదిస్తూనే వుంటారు. కానీ నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే రెండు స్వప్నదర్శనాలు మీతో పంచుకుంటాను.

ఒకసారి మేము కనుపూరు జాతరకి వెళ్ళాము. మా అన్నయ్య వాళ్ళూ కూడా వాళ్ళ ఊరినించి వస్తామన్నారు. నేను అక్కడ వాళ్లకోసం చాలా సేపు ఎదురుచూసాను. కానీ వాళ్ళు రాలేదు. అప్పుడు ఫోన్ చేస్తే, అన్నకు తేలు కుట్టిందని, చెన్నై ఆసుపత్రిలో చేర్చారని చెప్పారు. మర్నాడు మేము చెన్నై వెళ్లి ఆసుపత్రిలో అన్నని చూసేసరికి నాకు దుఃఖం ఆగలేదు. తను మనస్పృహలో లేడు. తేలువిషం తలకెక్కడం వల్ల, కోమాలోకి వెళ్లిపోయాడని వైద్యులు చెప్పారు. ఆ రోజు రాత్రి ఇదేవిషయం తలచుకుని బాగా బాధపడ్డాను. అప్పుడు ఒక స్వప్నం వచ్చింది. అందులో,,,,, నేను మా ఇంట్లో కట్టెల పొయ్యిమీద పాలు కాస్తున్నాను. పాలు దింపడానికి బట్ట తీసుకువద్దామని లోపలకి వెళ్లి వచ్చేలోగా, ఒక కాకి పాల గిన్నె మీద వాలడం వల్ల, గిన్నె తిరగబడి పాలన్నీ ఒలికిపోయాయి, అప్పుడు బాబా ఒక పక్కన నిల్చుని, నావైపు, తిరగబడిన గిన్నెవైపు మార్చి మార్చి చూస్తున్నారు. స్వప్నం అయిపోయింది. మర్నాడే మా అన్నయ్య చనిపోయాడు. అంటే జరగబోయేది ముందుగానే స్వప్నంలో ఆవిధంగా సూచించారన్నమాట. కానీ అప్పుడు నాకు తెలియలేదు.

ఇంకొకసంఘటన ,,,, మావారు కాలు నొప్పితో చాలాకాలం బాధ పడేవారు. చాలా రకాల వైద్యాలు చేయించాము. కొన్నాళ్ళకి నడవడం కూడా కష్టమయ్యింది.




ఒకరోజు రాత్రి నేను చాలా బాధపడుతూ నిద్రపోయాను. ఆ రాత్రి బాబా నాకు స్వప్నదర్శనమిచ్చి, మావారి వెన్నుపూస పైన టార్చిలైటు వేసి చూస్తున్నారు. నాకేమీ అర్ధం కాలేదు. మర్నాడు ఆసుపత్రికి వెడితే, వైద్యులు పరీక్షచేసి మావారికి 'వెన్నుపూస దగ్గర కండ పెరిగింది, అందువల్ల నడవలేకపోతున్నారు' అని చెప్పారు. బాబా దయవల్ల సరైన వైద్యం జరిగి తొందరలోనే కోలుకున్నారు.

ఇలా నేను నా జీవితంలో బాగా బాధపడిన రెండు సందర్భాలలో బాబా స్వప్న దర్శనాన్ని అనుగ్రహించారు. ఈ రెండు సంఘటనల తరవాత బాబా మమ్మల్ని విద్యానగర్ రప్పించుకున్నారు. మాకు ఒక అమ్మాయి. మేము ముగ్గురం శ్రీసాయిలీలామృతం, శ్రీగురుచరిత్ర నిత్య పారాయణ చేసుకుంటాము. బాబా దయవల్ల మేమందరం హాయిగా వున్నాము. వారికి శత సహస్రకోటి కృతజ్ఞతాభివందనములు!

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీ రామచంద్ర రావు, చీరాల**

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల స్మృతులను వారి లీలావైభవాన్ని, చీరాల వాస్తవ్యులు రామచంద్రరావుగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

నేను పూజ్యశ్రీ మాస్టరుగారి విద్యార్థిని. 1968 లో PUC లో చేరి 1973 లో BSC డిగ్రీ పూర్తిచేశాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు మాకు జనరల్ ఇంగ్లీషుకి వచ్చేవారు. చాలామంది విద్యార్థులలాగే నేనూ ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారి గదికి వెళ్లాను. ఆయనను చూస్తుంటే అలా చూడాలనిపించేది. తెల్లటి వర్చస్సుతో బయటా లోపలా బంగారు పూసినట్లున్నారు. నేను ఆయన కాలి చిటికెనవేలి గోరుకి కూడా సరిపోననిపించింది. కానీ ఆయన నన్ను ఆత్మీయంగా పలకరించి కూర్చోమని, వారి కుటుంబసభ్యుల ఫొటోలన్నీ నాకు చూపించారు. ఆయన ఎందుకలా చేస్తున్నారో నాకు అర్థం కాలేదు.

ఒకరోజు తరగతి గదిలో అందరికీ పాఠం చెప్తూ, "నేను ప్రతి సంవత్సరమూ పుస్తకాలు కొనుక్కోలేని విద్యార్థులకు పుస్తకాలు కొని ఇస్తుంటాను. ఈ సంవత్సరం నీకు ఇస్తున్నాను" అని, నా బెంచి మీద పుస్తకాల కట్ట పెట్టారు. నిజానికి మేము పేదవాళ్ళమే, కానీ నాకు చాలా అభిమానముండేది. నన్నేదో క్లాసులో ఆయన అవమానం చేశారని బాధపడి నాకు ఆ పుస్తకాలు వద్దన్నాను. తరవాత క్లాసులో అందరూ, 'ఆయన అంత ప్రేమగా ఇస్తుంటే వద్దంటావా?' అని నన్ను తిట్టారు. ఆరోజు సాయంత్రం వారి గదికి వెళ్ళి, ఉదయం క్లాసులో నా ప్రవర్తనకు క్షమించమని అడిగి పుస్తకాలు కావాలన్నాను. అప్పుడు కొన్ని పుస్తకాలు ఇచ్చి, మళ్ళీ వారి కుటుంబసభ్యుల ఫోటోలు చూపించి పంపించారు. మర్నాడు క్లాసులో మళ్ళీ అందరిముందూ మరికొన్ని పుస్తకాలు ఇచ్చారు. ఆయన ఏం సంకల్పం చేశారో కానీ, నాకు ఇంగ్లీషు మీద మంచి పట్టు వచ్చింది. అది నాకే చాలా ఆశ్చర్యంగా వుంటుంది. మా ఆఫీసులో నా ఆంగ్ల పరిజ్ఞానం బాగుంటుందని అందరూ మెచ్చుకునేవారు. 1973లో నాకు BSNL లో ఉద్యోగం వచ్చింది. కానీ చాలా తక్కువ జీతంతో డ్యూటీ క్లర్క్ గా ఉద్యోగం ఇచ్చారు. తరవాత BSNL విభాగానికి సంబంధించిన పరీక్షలకు కట్టి JAO గా ప్రమోషన్ వచ్చి కలకత్తాలో చేరాను.

ఒకసారి ఆఫీసు గొడవలలో నేను తలదూర్చడం వల్ల వాటికి సంబంధించి ఒక మీటింగు పెట్టి, ఆ విషయం చర్చిద్దామనుకున్నాను. దాదాపు ఆ గొడవలు ఒక పరిష్కారానికి కూడా వచ్చాయి. ఆ సమయంలో మా సెక్రెటరీ సమావేశం రద్దు చేశాడు. నాకు బాగా అవమానం కలిగి చనిపోవాలనిపించేంత బాధ కలిగింది. అటువంటి సమయంలో నేను పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వెళ్లాను. ఆ విషయం చెప్పగానే ఆయన బాగా నవ్వేసి, "చచ్చిపోయి ఏం చేద్దామనుకున్నావురా? ఈరోజు చచ్చిపోయావనుకో, రేపటినుంచి ఏం చేస్తావ్?" అన్నారు! నా దగ్గర సమాధానం లేదు. "సరే, నువ్వన్నట్టు భావనలో ఈరోజు చనిపోయావ్. ఇప్పుడు మళ్ళీ కొత్తగా జీవితం మొదలుపెట్టావ్. ఇది బాబా నీకు ఇచ్చిన అవకాశంగా భావించి బాబా ప్రచారం చేయి. పారాయణ చేసుకో! లీలలు సేకరించు" అని చెప్పుకుంటూ వచ్చారు. ఏ సమస్యకైనా వారి దగ్గర తక్షణమే సమాధానముండేది.

ఆ సమయంలో మేమిద్దరం ఎదురెదురుగా కూర్చున్నాం. పూజ్యశ్రీ మాస్టరుగారు కళ్ళు మూసుకుని తమ భృకుటిని దగ్గరకు చేశారు. వారి కనుబొమ్మల

మధ్యనుంచి ఒక కాంతి తిన్నగా వచ్చి నా గుండెలమీద పడింది! దానిని నేను నా కళ్లారా చూస్తున్నాను. వెంటనే నాకు అంతవరకు వున్న బాధంతా ఒక్కసారిగా పోయి హాయిగా అనిపించింది! నాకు ఆ సంఘటన విపరీతమైన ఆనందాన్ని కలిగించింది. అక్కడ జరిగిన ప్రక్రియ ఇప్పటికీ నాకు అంతుపట్టదు.

పూజ్యశ్రీ మాస్టరుగారిని భోజనానికి కొందరు భక్తులు పిలుస్తూ వుండేవారు. వారితో నేనూ వెళదామనిపించేది. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, “వద్దురా, వాళ్ళు ఏవేవో కోరికలు మనసులో పెట్టుకుని భోజనం పెడతారు. అది తినడం వల్ల తరవాత శరీరంలో కొన్ని సమస్యలు వస్తాయి. అవి తట్టుకోవడం కష్టం!” అని చెప్తూ, ఫలానా వాళ్ళింటికెళ్ళడం వల్ల అప్పుడు నాకు అలా జరిగింది.. ఇలా జరిగింది...అని చెప్పుకుంటూవచ్చారు. ‘అమ్మో! దీని వెనకాల ఇంత కథ వుందా?!’ అనుకున్నాను.

మేమంతా పూజ్యశ్రీ మాస్టరుగారితో ఒకసారి తిరుపతిలో హాస్టల్ లో కూర్చునివున్నాం. ఉన్నట్లుండి, “ఒరేయ్ ఇంగ్లీష్ లెక్చరర్ ని పిలుచుకునిరా!” అన్నారు. నాదేమో స్థూలకాయం, బాగా బద్ధకస్తుడిని. పైగా అతనేమో వెయ్యికాళ్ళమండపం పరిసరాల్లో వుంటాడు. ‘అబ్బా, అంత దూరం పోవాలా?!’ అని ఆలోచిస్తున్నా. మళ్ళీ వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు, “వెళ్ళక్కరలేదురా, తనే వస్తున్నాడు” అన్నారు. నిజంగానే మెమెవ్వరమూ పిలవకుండానే అతనంతట అతనే అక్కడికి వచ్చాడు!

ఇలాంటి సంఘటనే విద్యానగర్ లో కూడా ఒకసారి జరిగింది. నేను పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర కూర్చుని వున్నాను. ఆయన “ఒరేయ్ గోవిందప్పని పిలవరా!” అన్నారు. మళ్ళీ నా బద్ధకం, నేనూ మామూలే! ‘అబ్బా ఇప్పుడు లేచి వెళ్ళాలా?!’ అనుకున్నాను. ఇంతలోనే, “వాడే వస్తున్నాడులేరా!” అన్నారు. కాసేపటికే గోవిందప్ప వచ్చాడు!

ఒకసారి తిరుపతిలో పూజ్యశ్రీ మాస్టరుగారు నాస్తికులతో వాదించి, చివరకి వాళ్ళతో పాద నమస్కారం చేయించుకున్నారు. అది నేను కళ్లారా చూశాను. పూజ్యశ్రీ మాస్టరుగారి ఓపిక, దృఢ చిత్తం సామాన్యమైనవి కాదు. ఎన్ని గంటలైనా ఓర్పుగా మాట్లాడి, చివరికి ‘దేవుడు లేడు!’ అన్నవాళ్ళ తోటి ‘దేవుడు వున్నాడు!’ అని చెప్పించే దమ్ము వుంది ఆయనకి.

నా వైవాహికజీవితంలో కూడా సమస్యలొస్తే పూజ్యశ్రీ మాస్టరుగారు నా భార్యకు శ్రీ సాయి లీలామృతమిచ్చి పారాయణ చేయమన్నారు. తరవాత సమస్యలన్నీ తొలగిపోయాయి. నాకు ముగ్గురు పిల్లలు. పెద్దబ్బాయి పుట్టినప్పుడు అరవింద్ ఘోష్ గురించి కల వచ్చింది. నేను, ‘ఆయన పేరు పెట్టనా?’ అని అడిగితే, ‘అరవింద్ ప్రసాద్’ అని పెట్టమన్నారు. అలాగే పెట్టాను. పాప పుడితే, ‘సాయి కరుణ’ అని పేరు పెట్టమంటారా అని అడిగితే సరేనన్నారు. తరవాత బాబు పుడితే, ఆయన ‘హేమాద్రి సాయి’ అని పెట్టమన్నారు. నేను ‘దత్తాత్రేయ అని పెట్టనా?’ అని ఉత్తరం వ్రాశాను. నా ఉత్తరం చేరకుండానే, ‘హేమాద్రి సాయి’ అని పేరు పెట్టమని ఉత్తరం వ్రాశారు. నా ఉత్తరం చేరాక ‘దత్తాత్రేయ’ అనే పెట్టమన్నారు కానీ, నేను ‘హేమాద్రి సాయి’ అనే పెట్టాను

నేను కలకత్తాలో ఉద్యోగం చేస్తున్నప్పుడు ఒకసారి, “ఒరేయ్ ఇక్కడకి వచ్చెయ్యరా!” అన్నారు. అంటే ఆంధ్రాలో ఉద్యోగానికి బదిలీ పెట్టుకుని రమ్మన్నారు. కానీ నాకు కలకత్తాలో జీతమేకాక ఓవర్ టైం చేస్తే డబ్బులు దొరుకుతున్నాయి. అందుకని రానన్నాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, “ఒరేయ్ ఆ మూడొందలకోసం చూసుకుంటే, పొందవలసింది పోగొట్టుకుంటావురా!” అన్నారు. తరవాత కొన్నాళ్లకే పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందారు. ఇప్పుడనుకుంటాను, ‘ఆ మూడొందలకోసం చూసుకోకపోతే ఎంత బాగుండేది?’ అని! ఎందుకంటే పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందినపుడు ఒంగోలులో మా తమ్ముడున్నాడు. అతను ఆయనను చివరిసారి దర్శనం చేసుకున్నాడు. నమస్కారం చేసుకున్నాడు. సమాధి చేసేటప్పుడు ఊరేగింపులో పాల్గొన్నాడు. ‘అవన్నీ నేను పొందలేకపోయాను కదా, మళ్ళీ ఇప్పుడు కావాలనుకుంటే వస్తాయా? అయినా ఇంకొంతకాలం వారితో వుంటే ఇంకా ఎన్ని విషయాలు చెప్పేవారో!’ అని ఇప్పుడనిపిస్తుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందబోయే ముందు నాకు రెండు సూచనలు చేశారు. కానీ నేను అర్థం చేసుకోలేకపోయాను. ఇంకొక రెండు, మూడు నెలలకు సమాధి చెందుతారనగా నాకు ఒక కల వచ్చింది. అందులో పూజ్యశ్రీ మాస్టరుగారిని క్రింద పడుకోపెట్టారట. అక్కడకు

డాక్టరుగారు వచ్చి ఏదో చెప్పారు. ఇంక లాభం లేదని అంటున్నారట. ఈ కలని పూజ్యశ్రీ మాస్టరుగారికి చెప్తే, "ఒరేయ్ ఇంతవరకూ వచ్చిన కలలన్నీ జరిగాయి కదా! మరి ఇదేమవుతుందో వేచి చూద్దాం!" అన్నారు. తరవాత నాకు ఉద్యోగంలో అకౌంట్స్ ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చింది. అందువల్ల నా టేబుల్ మీద STD ఫోన్ సౌకర్యం వచ్చింది. ఇక ఆ సౌకర్యం వచ్చిందంటే చాలా గొప్ప స్థితి అని అర్థం. ఆరోజుల్లో రాజకీయ నాయకుల దగ్గర, బాగా డబ్బున్నవాళ్ళ దగ్గరే ఇటువంటి ఫోన్లు వుండేవి. 'మొదట పూజ్యశ్రీ మాస్టరుగారికి చేద్దామని నెంబర్ కలిపాను. ఫోన్ చేయగానే, నాకు రెండునెలల క్రితం పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి వచ్చిన కల గుర్తుకొచ్చి మనసులో గుబులుపుట్టి ఫోన్ పెట్టేసాను. కానీ ఇది జరిగిన 40 రోజుల తరవాత మా అమ్మ, 'పూజ్యశ్రీ మాస్టరుగారు సిద్ధి పొందారు. ఈరోజు 40 రోజుల మండలారాధన!' అని నాకు ఉత్తరం వ్రాసింది. అది చదివి కన్నీళ్ల పర్యంతమయ్యాను. "అరెరే! పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు తెలియచేసే ఉద్దేశంతోనే నాకు ఫోన్ సౌకర్యం కూడా కలిగించారు. ఆరోజు మనసులో ఆ భావనను కూడా కలిగించారు. ఇంకొద్దిసేపు ఫోన్ అలాగే పెట్టకుండా వుంచితే, బహుశా ఎవరైనా మాట్లాడి ఈ విషయం చెప్పి వుండేవారేమో! వెంటనే నేను వెళ్లి వుండేవాడిని కదా?!' అని చాలా బాధపడ్డాను.

నేను పేద కుటుంబంలో పుట్టినా నాకు మంచి జీవనోపాధి వచ్చేలా చేసి, చక్కటి కుటుంబాన్ని ఇచ్చి స్థిరపరచారు. వారి మేధస్సు ఎంత వుండేదో, నా అవగాహనా రాహిత్యం అంతగా వుండేది.

అయినా సరే నాపట్ల అత్యంత ప్రేమని చూపించి, నన్ను తీర్చిదిద్దారు. కానీ వారు సశరీరంగా వుండగా ఎన్ని విషయాలలో వారి గొప్పతనం నిరూపించబడుతున్నా గ్రహించలేని మనఃస్థితి నాది! మళ్ళీ అంతటి నిగర్వి, నిరాడంబరుడు, మహానుభావుడు లభించడం దుర్లభం. అటువంటి అద్వితీయమూర్తికి శతసహస్రకోటి వందనాలు తెలియచేసుకుంటున్నాను.

ఓం కారుణ్యమూర్తయే శ్రీ భరద్వాజ గురవే నమః

## అవధూత శ్రీ వెంకయ్యస్వామి

07వ పేజీ తరువాయి

బట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డికి వివాహమై నాలుగు సం॥లైనా సంతానం కలగలేదు. అతని భార్య స్వామి సమాధిని దర్శించి తనకు సంతానం ప్రసాదించమని ప్రార్థించింది. ఆ రాత్రికి స్వామి కలలో కనిపించి ఆమెకు ఒక దారం యిచ్చి నీకు సంతానం ప్రసాదించాను" అని చెప్పారు. తెల్లవారి ఆమె లేచేసరికి ఆ దారం నిజంగానే ఈమె తాళిబొట్టుకు చుట్టుకొని వుంది.

భాగవతుల రఘురామయ్య భార్యకి గుండెనొప్పి, రక్తపోటు, వంటికి నీరు వచ్చి ఎంతో బాధపడుతుండేది. మద్రాసు తీసుకువెళ్ళాలని అనుకున్నారు. ఒక రాత్రి ఆమెకు స్వామి స్వప్న దర్శనమిచ్చారు. ఆయన ఒక తెల్ల కాగితంపై వేలితో 'NEPHRO SAL' అని రాసి చూపారు. ఆ విషయం వారి కుటుంబ వైద్యులకి చెప్పి ఆ మందు తెచ్చుకున్నారు. ఆమె జబ్బు తగ్గిపోయింది. తర్వాత ఆమెకి, స్వామి కలలో ఐదు బత్తాయికాయలు ప్రసాదించారు. స్వామి బత్తాయిరసం తాగమన్నారనుకొని ఆమె బత్తాయిరసం తాగనారంభించింది. దాంతో ఆమె సంపూర్ణ ఆరోగ్యవంతురాలైంది.

రాఘవయ్యగారి దూడ తప్పిపోయి నెలరోజులైనా ఎంతవెదికినా కనిపించలేదు. అతడు ఒక రోజు స్వామి సమాధికి చెప్పుకుని దూడ దొరకాలని ప్రార్థించాడు. ఆ రోజు రాత్రి స్వామి స్వప్నంలో కనిపించి అతనిని వెంటబెట్టుకొని ఒక గ్రామంలోని బందిల దొడ్డికి తీసుకెళ్ళారు. అక్కడ అతని దూడ వుంది. తెల్లవారిన తర్వాత అతడు పెనవర్తి అనే గ్రామంలో బందిలదొడ్డికి వెళ్ళాడు. అక్కడ చూసేసరికి అతని దూడ అందులోనే వున్నది.

అవధూత శ్రీ వెంకయ్య స్వామి నిత్యసత్యులు. శ్రీ స్వామి సమాధి చెందిన రోజును పురస్కరించుకుని తమ దర్శన ఆశీస్సులు ప్రసాదించమని ప్రార్థిస్తూ ఆయనకు నమస్సుమాంజలులు సమర్పిద్దాము.

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే
# రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

**శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

**శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

**ఇతర మహాత్ముల గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

**అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

**ధ్యాన సంబంధమైన గ్రంథములు**

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

**ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

**ఇతర గ్రంథములు**

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

**పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

**బాలల కొరకు విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

**BOOKS IN ENGLISH**

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

**BOOKS IN OTHER LANGUAGES**

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |

నేను దర్శించిన మహాత్ములు-4

# అవధూత శ్రీ వెంకయ్య స్వామి



## పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ


అవధూత శ్రీ వెంకయ్య స్వామివారి ఆరాధన

(24-08-2024)

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.

## నేను దర్శించిన మహాత్ములు

# శ్రీ ఆనందమాయి అమ్మ



## ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

శ్రీ ఆనందమయి అమ్మ ఆరాధన

(27-08-2024)

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.